టాప్ న్యూస్

## ధనత్రయోదశి వేళ
- రూ.లక్ష కోట్ల వ్యాపారం



02

## కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా దానం
- 40 మందితో కూడిన జాబితా విడుదల
- సీఎం రేవంత్, మీనాక్షి నటరాజన్, మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు పేర్లు



02

## దండుపాళ్యం పాలన అంటే గుర్తొచ్చేది మీరు
- హరీష్ పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్



02

Follow: @ANNTELUGU
ANN తెలుగు
19-10-2025
# మహా పత్రిక
ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 314 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

## బీసీ బంద్.. వ్యూహాలు

తెలంగాణలో బీసీ బంద్ విజయవంతం అయింది. తెలంగాణ రాజకీయాల్లో మళ్ళీ వేడి రగలింది. బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కేంద్ర–రాష్ట్రాల మధ్య తగువుకు దారితీస్తోంది. బీసీ బంద్‌తో రాజకీయంగా ఎవరికి లాభం, ఎవరికీ నష్టం అనే చర్చ మొదలైంది. బీసీ బంద్ కు అన్ని ప్రధాన పార్టీలు మద్దతిచ్చాయి. ఇంతకూ ఈ రిజర్వేషన్లు ఇచ్చేది ఎవరు? ఇచ్చేవారే ధర్నాలో కూర్చుంటే అది మొక్కుబడి వ్యవహారమా? నిజాయితీనా? వ్యూహమేంటో తేలాల్సి ఉంది. రాజకీయ నష్టనివారణ వ్యూహంలా కనబడుతోంది. చిత్తశుద్ధితో అందరూ ప్రయత్నిస్తే బీసీ రిజర్వేషన్ల సాధన కష్టం కాదు. రాజకీయాల విషయానికొస్తే తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకు అంతర్గత సమస్యలున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయ దిశను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది.

**- తాజా రాజకీయ పరిణామాలపై ఎఎన్ఎన్ సిఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ ఎనాలసిస్**

ఎడిటోరియల్ పేజీ 4లో



# తెలంగాణ బంద్ ప్రశాంతం

### బంద్‌లో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్, మంత్రులు సురేఖ, శ్రీహరి

బంద్‌కు దూరంగా బిజెపి చీఫ్ , బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీష్

ఆటోలో వచ్చి బంద్ కు మద్దతుగా కవిత ధర్నా..

బీసీ ధర్నాలో కవిత తనయుడు ఆదిత్య

ఆదిలాబాద్ లో బంద్ కు మద్దతుగా కంది శ్రీనివాసరెడ్డి ర్యాలీ

**హైదరాబాద్, మహా:** స్థానిక ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) శనివారం రాష్ట్ర వ్యాప్తంగా చేసిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. బంద్ కారణంగా ఉదయం నుంచి ఆర్టీసీ డిపోలకే పరిమితమైన బస్సులు సాయంత్రం 5 గంటల నుంచి రోడ్డెక్కాయి. హైదరాబాద్ జేబీఎస్ నుంచి కరీంనగర్, సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, బోధన్, మెదక్, వేములవాడ, యాదగిరిగుట్ట, బాన్సువాడ, సిద్ధిపేట, గజ్వేల్.. ఇలా తెలంగాణలోని ప్రధాన ప్రాంతాలకు బస్సులు బయల్దేరాయి. 'బంద్ ఫర్ జస్టిస్' పేరుతో శనివారం తెలంగాణ బంద్ జరిగింది. బీసీ సంఘాల జేఏసీ విజ్ఞప్తి మేరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు సీపీఎం, సీపీఐ లాంటి లెఫ్ట్ పార్టీలు, ప్రజా, స్టూడెంట్ యూనియన్లు మద్దతు ప్రకటించి, స్వయంగా పాల్గొన్నాయి. శనివారం రాష్ట్రవ్యాప్తంగా దుకాణాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు కూడా నడపొద్దని పిలుపునివ్వడంతో బస్సులు రోడ్డెక్కలేదు. రాజ్యాంగ సవరణ ద్వారానే 42శాతం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత లభిస్తుందని, ఇందుకోసం బీజేపీపై ఒత్తిడి తీసుకువస్తామని, కాంగ్రెస్ పై కూడా పోరాడుతామని జేఏసీ నేతలు స్పష్టంచేశారు. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీపై ధ్వజమెత్తారు. సికింద్రాబాద్ లో మంత్రి కొండా సురేఖ, ఎంజీబీఎస్ లో వాకిటి శ్రీహరి ధర్నాలో పాల్గొన్నారు.

మిగతా 3లో

# ఏడాదిలో 60 వేల ఉద్యోగాలిచ్చాం

### త్వరలోనే గ్రూప్ 3, గ్రూప్4 పూర్తి చేస్తాం

తల్లిదండ్రులను విస్మరిస్తే అధికారుల జీతం కట్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

గ్రూప్ –2 సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత




**హైదరాబాద్, మహా:** తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల బలీయమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాల్సిన గురుతరమైన బాధ్యత గ్రూప్2 లో ఎంపికైన అభ్యర్థులందరిపైనా ఉందని, అందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన "ప్రజా పాలనలో కొలువుల పండుగ" కార్యక్రమంలో భాగంగా గ్రూప్ –2 సర్వీసులకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా లాంఛనంగా నియామక పత్రాల అందజేశారు.

మిగతా 2లో

## జోరుగా నవీన్ యాదవ్ ప్రచారం

### జూబ్లీహిల్స్ లో దూసుకుపోతున్న కాంగ్రెస్

భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

02

## బీసీ పోరాటంలో కవిత కుమారుడు

### తల్లితో కలిసి బంద్‌లో పాల్గొన్న ఆదిత్య

రిజర్వేషన్ల సాధన కోసం రోడ్డుపై నిరసన

02



# ధనత్రయోదశి వేళ

## రూ.లక్ష కోట్ల వ్యాపారం

**ఢిల్లీ, మహా:** ధనత్రయోదశి సందర్భంగా దేశవ్యాప్తంగా వినియోగదారులు దాదాపు రూ.లక్ష కోట్ల మేర ఖర్చు చేశారని 'కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్' అంచనా వేసింది. బంగారం , వెండి ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ.. కొనుగోళ్లు జోరుగా సాగాయని వెల్లడించింది. బంగారం, వెండి అమ్మకాలే రూ.60 వేల కోట్లు దాటాయని పేర్కొంది. గత ఏడాదితో పోలిస్తే ఇది 25 శాతం అధికమని తెలిపింది. వెండి ధరలు కూడా పెరిగినప్పటికీ.. డిమాండ్ ఎక్కువగా ఉందని చెప్పింది. కిచెన్ సామగ్రి రూ.15 వేల కోట్లు, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ వస్తువులు రూ.10 వేల కోట్లు, అలంకరణ, పూజా సామగ్రి విక్రయాలు రూ.మూడు వేల కోట్ల మేర జరిగాయని సీఏఐటీ తెలిపింది.



# కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్‌గా దానం

- 40 మందితో కూడిన జాబితా విడుదల
- సీఎం రేవంత్, మీనాక్షి నటరాజన్, మల్లు భట్టివిక్రమార్క, శ్రీధర్ బాబు పేర్లు

**మహా:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కోసం 40 మందితో కూడిన స్టార్ క్యాంపెయినర్ల జాబితాను కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. ఈ జాబితాలో తెలంగాణ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు విజయశాంతి, దానం నాగేందర్ పేరు కూడా ఉంది. పార్టీ మారిన దానం నాగేందర్ పేరును జాబితాలో చేర్చడం ద్వారా కాంగ్రెస్ పార్టీలో దానం చేరికను మరోసారి అధికారికంగా అంగీకరించినట్లయింది. నవంబర్ 11న జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉప ఎన్నిక జరగనుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ స్టార్ క్యాంపెయినర్ల జాబితాను విడుదల చేసింది.

### జాబితా ఇదే...

1. మీనాక్షి నటరాజన్, 2. రేవంత్ రెడ్డి,
3. మహేశ్ కుమార్ గౌడ్, 4. పి. విశ్వనాథన్,
5. మల్లు భట్టి విక్రమార్క, 6. ఉత్తమ్ కుమార్ రెడ్డి,
7. దామోదర రాజనర్సింహ, 8. వంశీచంద్ రెడ్డి,
9. శ్రీధర్ బాబు, 10, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,
11. పొన్నం ప్రభాకర్, 12. సీతక్క,
13. కొండా సురేఖ, 14. తుమ్మల నాగేశ్వరరావు,
15. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,
16. జూపల్లి కృష్ణారావు, 17. వివేక్,
18. అడ్లూరి లక్ష్మణ్ కుమార్,
19. శ్రీహరి ముదిరాజ్,20. రేణుకా చౌదరి,
21. సంపత్ కుమార్, 22. వి. హనుమంత రావు,
23. అజారుద్దీన్, 24. జానారెడ్డి,
25. షబ్బీర్ అలీ, 26. మధుయాష్కీ గౌడ్,
27. విజయశాంతి, 28. అంజన్ కుమార్ యాదవ్,
29. బల్‌రాం నాయక్, 30. మల్లు రవి,
31. చామల కిరణ్ కుమార్ రెడ్డి,
32. అనిల్ కుమార్ యాదవ్,
33. జెట్టి కుసుమ్ కుమార్,
34. దానం నాగేందర్, 35. రాములు నాయక్,
36. సునీతా ముదిరాజ్, 37. జక్కిడి శివచరణ్ రెడ్డి,
38. యెడవల్లి వెంకటస్వామి,
39. సీ.ఎన్. రెడ్డి, 40. బాబా ఫసీయుద్దీన్




# బీసీలకు రాజ్యాధికారం రావాలి

ఆశయాన్ని ముద్దాడే దాకా ఉద్యమం
బిజెపి ఎంపీ ఈటల రాజేందర్

**హైదరాబాద్, మహా :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఎలా సాధ్యమైందో ప్రతి బీసీ ఇంట్లో సాధించాలనే తపన ఉందని, బీసీ రాజ్యాధికారం కూడా సాధ్యం అవుతుందని ఎంపీ ఈటెల రాజేందర్‌ధీమా వ్యక్తం చేశారు. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్య ఉద్యమాలు చేద్దామని, బీసీ బంద్ఒక రాజకీయ పార్టీకి సంబంధించింది కాకుండా యావత్ తెలంగాణలో 52 శాతం ఉన్న బీసీలది కావాలన్నారు. శనివారం జేబీఎస్‌వద్ద జరిగి బంద్‌లో పాల్గొన్ని మాట్లాడుతూ స్వతంత్రం వచ్చి 70 ఏళ్లు గడిచిన ఒక బీసీ ముఖ్యమంత్రి కాలేకపోయారని, మంత్రివర్గంలో కూడా సమునచిత స్థానం లేదని, ఏ పార్టీ పాలించిన బీసీలకు మంత్రి పదవులు ఇవ్వలేదని మండిపడ్డారు. ఈ వర్గాలు రాజకీయంగా సామాజికంగా ఆర్థికంగా విద్యాపరంగా నష్టపోతున్నారని అనేక పార్టీలు మాట్లాడి మేనిఫెస్టోలో పెట్టారు కానీ చాలా సమస్యల పరిష్కారం జరగలేదన్నారు. తెలిసి కూడా మోసం చేయవద్దని డ్రామాలు ఆడవద్దని బీసీల ఆత్మగౌరవంతో వెలగాట మాటా చలగాట మాట వద్దని చాలామంది మేధావులు ఈ ప్రభుత్వానికి చెప్పారని గుర్తు చేశారు.

# ఏడాదిలో 60 వేల ఉద్యోగాలిచ్చాం

## త్వరలోనే గ్రూప్ -3, గ్రూప్-4 పూర్తి చేస్తాం

తల్లిదండ్రులను విస్మరిస్తే అధికారుల జీతం కట్.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

గ్రూప్ –2 సర్వీసులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేత





ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు సలహాదారులు, ప్రజా ప్రతినిధులు, చీఫ్ సెక్రటరీ హాజరయ్యారు. దీపావళి పండుగ శుభవేళ ఉద్యోగ నియామక పత్రాలను అందుకుంటున్న అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలని తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను నిర్దేశించామని ముఖ్యమంత్రి గుర్తుచేస్తూ, గ్రూప్2 లో ఎంపికైన వారంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. 'మనిషి జీవితంలో జన్మదినం ఎంత ముఖ్యం, ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం అందుకోవడం కూడా అంతే ముఖ్యమైన రోజు. ఈరోజు అందుకోబోయే నియామక పత్రం జీవితంలో ఒక భావోద్వేగం. ఈరోజు నుంచి మీరంతా బాధ్యత కలిగిన అధికారులు. ఎల్లప్పుడు అప్రమత్తంగా వ్యవహరించండి. 4 కోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్తును భద్రంగా కాపాడుకుంటూ ముందుకు సాగాలి. ప్రభుత్వ అధికారులుగా ఉద్యోగంలో చేరడానికి తమ రక్తాన్ని చమటగా మార్చి మిమ్మల్ని భూజాన మోసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. కన్న తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన ఊరిని అభివృద్ధి చేసుకోవడం మీ బాధ్యత. ఈరోజు నుంచి అధికారులుగా మీవద్దకు వచ్చే ఏ పేదవాడిలోనైనా తల్లిదండ్రులను గుర్తు తెచ్చుకుని సేవలు అందించాలి. నిస్సహాయులకు అండగా సహాయం అందించడమే బాధ్యతగా విధులు నిర్వర్తించాలి. ఎవరైనా తల్లిదండ్రులను విస్మరిస్తే వారి జీతం నుంచి 10 శాతం కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేట్టుగా చట్టం చేయబోతున్నాం. ముందుగానే గ్రూప్ 2 ఫలితాలు వెల్లడించినట్టయితే ఎంపికైన అభ్యర్థులు తిరిగి గ్రూప్1 లో కూడా సెలెక్షన్ వస్తే అందులోకి వెళ్లినప్పుడు గ్రూప్2 ఖాళీల్లో కొందరు అభ్యర్థులు అవకాశాలు కోల్పోతారని భావించి ముందుగా గ్రూప్1 ఫలితాలు విడుదల చేశారు. అదే క్రమంలో గ్రూప్ 3 ఆ తర్వాత గ్రూప్4 ఫలితాలను కూడా వెల్లడిస్తారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. అలాగే, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన పూర్తి చేశాం" అని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఉద్బోధించారు.



# జోరుగా నవీన్ యాదవ్ ప్రచారం

జూబ్లీహిల్స్ లో దూసుకుపోతున్న కాంగ్రెస్.. భారీగా హాజరైన నాయకులు, కార్యకర్తలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆశయాలను నెరవేర్చే శక్తి కాంగ్రెస్ పార్టీదే అని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గం వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్ ప్రాంతంలో నవీన్ యాదవ్ డోర్ టు డోర్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మమేకమై ప్రతి ఇంటి వద్దకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి పనులను.. సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ప్రజల సమస్యలను వినిపించి, వాటి పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రమే కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆశయాలను నెరవేర్చే శక్తి కాంగ్రెస్ పార్టీదే అని, అభివృద్ధి, సంక్షేమం అందించే చేతి గుర్తుకు మీ విలువైన ఓటు వేయాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రచారాన్ని విజయవంతం చేశారు.

# దండుపాళ్యం పాలన అంటే గుర్తొచ్చేది మీరు

## హరీష్ పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

**హైదరాబాద్, మహా :** దండుపాళ్యం' పాలన అంటే ఎవరిదో రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అందుకే గట్టిగా కర్ర చాచి వాత పెట్టారని ఎద్దేవా చేశారు. అధికారం లేదన్న అసహనం, నిరాశలో కేబినేట్ పై ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను ఆయన శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. మంత్రుల మధ్య కుమ్ములాటలు, కేబినేట్ సమావేశంలో వర్గాలుగా విడిపోయి గొడవలు పడ్డారంటూ కట్టుకథల్ని సృష్టించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారంతా సినిమాల్లో రచయితలుగా ప్రయత్నించాలని, మంచి భవిష్యత్తు ఉంటుందని హితవు పలికారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో కేబినేట్ సమష్ఠిగా రాష్ట్రాభివృద్ధి కోసం పని చేస్తుందని స్పష్టం చేశారు. భావితరాల భవిష్యత్తు కోసం చిత్తశుద్ధితో అహర్నిశలు శ్రమిస్తున్న మా మంత్రులకు ప్రత్యేకంగా వ్యక్తిగత అజెండా అంటూ ఏదీ లేదన్నారు. మాకు అవకాశమిచ్చిన తెలంగాణ ప్రజల ఆశయాలు, ఆకాంక్షలే మా అందరి అజెండా అని తేల్చి చెప్పారు. మేం వేసే ప్రతి అడుగు రాష్ట్రాభివృద్ధి కోసమేనని, ఈ విషయంలో ఎలాంటి అపోహాలకు తావు లేదని స్పష్టం చేశారు.

# నీవే నా తొలి ప్రేమ

## తెలుగు ఆల్బమ్ సాంగ్స్ లాంచ్..




**హైదరాబాద్, మహా :** ప్రేమ, విరహం వంటి సున్నితమైన అంశాలతో యువతరాన్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన అద్భుతమైన ప్రైవేట్ మ్యూజికల్ ఆల్బమ్ తెలుగు వెర్షన్ "నీవే నా తొలి ప్రేమ" ను హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. 'లవ్ అండ్ బ్రేకప్' అనే థీమ్‌తో, హృదయాన్ని హత్తుకునేలా ఈ ఆల్బమ్ రూపొందించిన ఈ థీమ్ సాంగ్స్ ను ప్రముఖ డైరెక్టర్, తెలుగుసినిమా డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ తోపాటు ప్రముఖ సినీ సంగీత దర్శకులు భోలే షావాలి వేర్వేరుగా ఆవిష్కరించారు. ప్రముఖ డైరెక్టర్, తెలుగు సినిమా డైరెక్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వీరశంకర్ మాట్లాడుతూ.."వెన్ ల్యాక్స్ టీమ్ అంతా చాలాబాగా వర్క్ చేసింది. పెద్ద సినిమాల్లో పాటల్లా ఎంతో క్వాలిటీతో చేశారు. ముఖ్యంగా ఈ పాటలు యువతతోపాటు అన్ని వయసులవారిని ఆకట్టుకునేలా ఉన్నాయి" అని అన్నారు. ఈ సందర్భంగా సంగీత దర్శకులు భోలే షావాలి మాట్లాడుతూ, "యూత్‌కు కనెక్ట్ అయ్యే మంచి మ్యూజిక్, ఎమోషనల్ కంటెంట్ తో ఈ ఆల్బమ్ రూపొందించడం చాలా సంతోషకరం. ఈ పాటల్లో మాంచి లవ్ స్టోరీ ఫీల్ ఉంది. "వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్" అండ్ వెన్ ల్యాక్స్ మ్యూజిక్స్ పతాకంపై నిర్మించిన ఈ పాటలు కచ్చితంగా ప్రేక్షకులను అలరిస్తాయి. యువ ప్రతిభను ప్రోత్సహించిన నిర్మాతలకు, దర్శకుడికి నా అభినందనలు," అని భోలే షావాలి అన్నారు. ఈ ఆల్బమ్‌లో యంగ్ టాలెంటెడ్ ఆర్టిస్టులు హరీష్ దాచేపల్లి, సాయి నీరజ ప్రధాన పాత్రల్లో నటించారు. జగదీష్ కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా లవర్ పాత్రలో హరీష్ దాచేపల్లి నటన, భావోద్వేగాలను పలికించిన తీరు ఎంతో సహజంగా, హృదయానికి హత్తుకునేలా ఉందని యూనిట్ సభ్యులు తెలిపారు.

### సాంకేతిక వర్గం..

ఈ ఆల్బమ్‌కు ప్రముఖ సినీ దర్శకుడు తాజుద్దీన్ దర్శకత్వం వహించడంతో పాటు, పాటలకు అద్భుతమైన సాహిత్యాన్ని కూడా అందించారు. సమర సింహ అందించిన సినిమాటోగ్రఫీ ఈ పాటల విజువల్స్‌ను మరింత గ్రాండ్‌గా, ఎక్సలెంట్‌గా తీర్చిదిద్దింది. ఎడిటింగ్, డీఐ బాధ్యతలను జగదీష్ కుమార్ నిర్వహించగా, ప్రశాంత్ ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేశారు. అలాగే, నరేష్, సందీప్ వంటి సాంకేతిక నిపుణుల కృషి ఈ ఆల్బమ్‌కు అదనపు ఆకర్షణగా నిలిచింది. మొత్తం మీద, వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ "నీవే నా తొలి ప్రేమ" మ్యూజికల్ ఆల్బమ్ నేటి తరం యువ ప్రేక్షకులను, ముఖ్యంగా ప్రేమ విఫలమైన వారిని, తమ కథగా భావించేలా చేస్తుందని, తద్వారా ఈ పాట పెద్ద విజయం సాధిస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ పాటలు అన్ని డిజిటల్ మ్యూజిక్ ప్లాట్ ఫామ్‌లలో అందుబాటులోకి రానున్నాయని వెన్ ల్యాక్స్ ప్రొడక్షన్స్ అధినేత దాచేపల్లి హరీష్ వెల్లడించారు. ఈ లవ్ అండ్ బ్రేకప్ థీమ్ ఆల్బమ్ సాంగ్స్ రీల్స్ చేసేందుకు వీలుగా ఉంటాయని, అందుకోసం సెర్చ్ ఆప్షన్ ద్వారా ఈ సాంగ్స్ ను పొందడానికి 'నీవే నా తొలి ప్రేమ' Neeve Naa Tholi Prema (Her SilenceFemale Version)పేరుతో సెర్చ్ చేయవచ్చని ఆయన తెలిపారు.



# బీహార్ ఎన్నికల ప్రచారంలో మంత్రి పొంగులేటి

## మహాగట్ బంధన్ విజయం ఖాయమని ధీమా

**మహా :** బీహార్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆర్జేడీ వామపక్షాలతో కూడిన 'మహాఘట్ బంధన్' అఖండ విజయం సాధిస్తుందని కాంగ్రెస్ బీహార్ ఎన్నికల పరిశీలకులు, తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బీహార్ కాంగ్రెస్ పార్టీ పరిశీలకునిగా పాట్నా నుంచి పర్యటన ప్రారంభించిన మంత్రి పొంగులేటి శనివారం బీహార్‌లోని పశ్చిమ చంపారన్ జిల్లా నూతన్ అసెంబ్లీ నియోజకవర్గం మహాకూటమి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అమిత్ గిరి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తమ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే బీహార్ ప్రజలను చైతన్యపరిచారని, ఆ రాష్ట్రంలో ఓట్ల కుంభకోణాన్ని ప్రజలకు వివరించి మహాఘట్ బంధన్ విజయానికి బాటలు వేశారని అన్నారు. ఇటీవల మహిళలకు తాయిలాలను పంచిన ప్రధాని నరేంద్రమోడి ఒక విధంగా వారి కూటమి పరాజయాన్ని ముందుగానే అంగీకరించారని, నవంబర్ 14న జరిగే ఓట్ల లెక్కింపుతో ఈ విషయం సుస్పష్టం అవుతుందన్నారు. ఎన్డీయే కూటమి పాలనలో నీతీష్‌కుమార్ అన్ని రంగాలలో విఫలమయ్యారని, ఈసారి ప్రజలు ఆయనను తిరస్కరించబోతున్నారని పొంగులేటి అన్నారు.

# బీసీ పోరాటంలో కవిత కుమారుడు

తల్లితో కలిసి బంద్‌లో పాల్గొన్న ఆదిత్య.. రిజర్వేషన్ల సాధన కోసం రోడ్డుపై నిరసన




**హైదరాబాద్, మహా :** 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం బీసీ సంఘాలు తలపెట్టిన తెలంగాణ బంద్‌కు మద్దతుగా తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ చౌరస్తాలో నిర్వహించిన మానవహారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పోరాటంలో తల్లి కవితతో పాటు ఆమె కుమారుడు ఆదిత్య కూడా రోడ్డెక్కారు. విదేశాల్లో చదువు పూర్తి చేసుకుని ఇటీవలే ఇండియాకు తిరిగి వచ్చిన ఆదిత్య బీసీల రిజర్వేషన్ల పోరాటానికి తన మద్దతును గట్టిగా వినిపించారు. 'బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే' అంటూ ప్లకార్డు పట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేవలం తమ తల్లి లేదా కొందరు నాయకులు మాత్రమే పోరాటం చేస్తే సరిపోదని, ప్రతి ఇంటి నుంచి అందరూ బయటకు వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అవసరమని బీసీల రాజకీయ సాధికారతకు ఇది తప్పనిసరి అని ఆదిత్య వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కవిత మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన 42 శాతం బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వటం విచారకరమన్నారు. ఈ రిజర్వేషన్లను చట్టబద్ధం చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు కలిసి రావాలని ఆమె కోరారు. బంద్ లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలో పాల్గొనడాన్ని కవిత తీవ్రంగా తప్పుపట్టారు. హత్య చేసిన వాడే సంతాప సభ పెట్టినట్లుందని కాంగ్రెస్, బీజేపీలను ఉద్దేశించి కవిత వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నాయని, ఈ రెండు పార్టీలు బీసీ రిజర్వేషన్ల విషయాన్ని రాజకీయంగా వాడుకునేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు.

### అందినంత దండుకున్న క్యాబ్ లు


బంద్ నేపత్యంలో ఆర్టీసీ బస్సులు రోడ్లపైకి రాకపోవడాన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ప్రయాణికులను నిలువునా దోపిడీ చేశాయి. సాధారణం కంటే అధిక ఛార్జీలు వసూలు చేస్తూ ప్రయాణికులను దోచుకున్నాయి. అత్యవసర సేవల్లో పనిచేసే సిబ్బంది సైతం ఉద్యోగాలకు వెళ్లేందుకు ప్రైవేట్ క్యాబ్‌లను ఆశ్రయించి అధిక ధరలు చూసి బెంబేలెత్తారు. హైదరాబాద్‌లోని ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద ప్రైవేట్ క్యాబ్ డ్రైవర్ల దందా ప్రయాణికులకు షాక్‌నిచ్చింది. ఉప్పల్ నుంచి హన్మకొండకు సాధారణ రోజుల్లో రూ. 300 వసూలు చేసే క్యాబ్ డ్రైవర్లు.. బంద్ కారణంగా ఏకంగా రూ.700 వరకు డిమాండ్ చేశారు. ఎల్ బీ నగర్ నుంచి సూర్యపేటకు వెళ్ళేందుకు సాధారణ రోజులలో రూ. 200 లు వసూలు చేసే క్యాబ్ డ్రైవర్లు ఏకంగా రూ. 800 ల వరకు వసూలు చేశారు. ఇది దాదాపు డబుల్ కంటే ఎక్కువ ఛార్జీ. మరోవైపు నగరంలో ఇన్నాళ్లు ఆర్టీసీ ఉచిత ప్రయాణం పథకం కారణంగా ప్రయాణికులు లేక వెలవెలబోయిన ఆటోలకు, బంద్ కారణంగా ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ప్రయాణికుల రద్దీతో ఆటోలు ఫుల్ డిమాండ్‌తో నడుస్తున్నాయి, ఆటో డ్రైవర్లు సైతం ఇష్టానుసారంగా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి.

# జీఎస్టీ ధమాకా.. రికార్డు కొనుగోళ్లు

**ఢిల్లీ, మహా:** ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త జీఎస్టీ సంస్కరణల వల్ల దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. సెప్టెంబర్ 22న తీసుకువచ్చిన సంస్కరణల వల్ల వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. అందువల్లే వినియోగదారులు ఆశించిన దానికంటే ఎక్కువ ప్రయోజనాలను పొందుతున్నారన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. జీఎస్టీ 2.0పై కేంద్రమంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్విని వైష్ణవ్ పాల్గొన్నారు.

**రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం..**

ఎన్డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో దేశమంతా పండగ వాతావరణం నెలకొందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోదీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ అన్నారు. జీఎస్టీ డబుల్ ధమాకాతో మోదీ దేశప్రజల ఇంటికి లక్ష్మీదేవిని తీసుకువచ్చారన్నారు. జీఎస్టీ సంస్కరణలు అన్ని రంగాల్లో ఉత్సాహాన్ని తీసుకువచ్చాయని..వీటితో దేశంలోని అన్ని రంగాలు లాభపడతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్లు తెలిపారు. ఈ సంస్కరణల కారణంగా దేశంలో వినియోగం పెరుగుతోందని.. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. అమెరికాకు స్మార్ట్‌ఫోన్‌లను ఎగుమతి చేయడంలో భారత్ తన పొరుగు దేశాన్ని అధిగమించిందని చైనాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఇది దేశం సాధించిన అతిపెద్ద విజయమన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.





42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు బంద్ చేపట్టాయి. అధికార కాంగ్రెస్ పార్టీ బంద్‌కు మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ సికింద్రాబాద్‌లో నిరసన చేపట్టారు. బీసీలకు వెంటనే న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. - మహా, హైదరాబాద్,



బీసీ ఫర్ జస్టిస్ పేరుతో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు బీసీ జేఏసీ చేపట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీకి చెందిన బీసీ నేతలు పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్ యాదవ్, అంజనేయులు గౌడ్, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, తుల ఉమ, రాజయ్య యాదవ్ తదితర నేతలు తెలంగాణ భవన్‌లో సమావేశమయ్యారు. అనంతరం తెలంగాణ భవన్ నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌కు ర్యాలీగా వెళ్లి రహదారిపై బైఠాయించారు. 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, మాజీ ఎమ్మెల్యే దాస్య వినయ్ భాస్కర్, మన్నె గోవర్ధన్‌రెడ్డి తదిరత నేతలు పాల్గొన్నారు.

- మహా, హైదరాబాద్

# తెలంగాణ బంద్ ప్రశాంతం

## బంద్‌లో పాల్గొన్న పీసీసీ చీఫ్ మహేష్, మంత్రులు సురేఖ, శ్రీహరి

### బంద్‌కు దూరంగా బిజెపి చీఫ్ , బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీష్

### ఆటోలో వచ్చి బంద్ కు మద్దతుగా కవిత ధర్నా.. బీసీ ధర్నాలో కవిత తనయుడు ఆదిత్య

### ఆదిలాబాద్ లో బంద్ కు మద్దతుగా కంది శ్రీనివాసరెడ్డి ర్యాలీ



(మొదటిపేజీ తరువాయి)

జేబీఎస్ లో ఈటల రాజేందర్ ధర్నాలో పాల్గొన్నారు. ఆదిలాబాద్ లో జరిగిన బంద్ లో కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి పాల్గొని భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు.

**బీసీల ధర్నాకు హాజరుకాని కేటీఆర్, హరీశ్ , బీజేపీ రామచందర్ రావు**

బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పించాలనే డిమాండ్ తో యావత్ తెలంగాణ స్తంభించింది. అయితే తాము వ్యతిరేకం కాదని చెబుతూ వస్తున్న పార్టీల చీఫ్ లు ఆందోళనల్లో పాల్గొనలేదు. ఆర్ కృష్ణయ్య స్వయంగా అన్ని పార్టీల చీఫ్ లను కలిసి బంద్ కు మద్దతు కోరారు. అందరూ పూర్తి మద్దతు ప్రకటించారు. అయితే శనివారం బంద్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు పాల్గొనలేదు. ఆర్టీసీ క్రాస్ రోడ్డులో నిర్వహించిన నిరసనలో మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, గంగుల కమలాకర్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ స్టేట్ చీఫ్ రాంచందర్ రావు, బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి కూడా ధర్నాల వైపు రాలేదు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చురుకుగా ఆందోళనలో పాల్గొన్నారు. బైక్ ర్యాలీ నిర్వహించారు. ట్యాంకు బండ్ పై బైఠాయించారు. మరోవైపు జాగృతి అధినేత కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ఆటోలో వచ్చిన కవిత ఆకర్షణగా నిలిచారు. కవిత తనయుడు ఆదిత్య రాజకీయ ప్రవేశాన్ని బీసీ ధర్నా ఖాయం చేసింది. బీసీ ధర్నాలో కవిత తనయుడు పాల్గొనడంతో పాటు మీడియాకు బైట్స్ కూడా ఇచ్చారు.



## బీసీ బంద్.. దిల్‌సుఖ్ నగర్‌లో ఉద్రిక్తత

**హైదరాబాద్, మహా:** 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలు బంద్ చేపట్టాయి. దిల్‌సుఖ్ నగర్‌లో బీసీ సంఘాల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇక్కడ ఆర్టీసీ బస్ డిపోల ఎదుట, రోడ్లపై బైఠాయించి బస్సులు నడపకుండా అడ్డుకున్నారు. కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు, కుల సంఘాల నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున బంద్‌లో పాల్గొన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. పలు ప్రైవేటు బస్సులను అడ్డుకున్నారు. ఈక్రమంలో పోలీసులు వారిని వారించేందుకు ప్రయత్నించారు. పోలీసులు, బీసీ సంఘాల నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.



సిద్దిపేటలో రోడ్లపై టైర్లను తగలబెడుతూ నిరసన తెలుపుతున్న బీసీ సంఘాలు

## పలు ఉద్రిక్తత పరిస్థితులు

**కరీంనగర్, హైదరాబాద్, మహా:** బీసీ బంద్ నేపథ్యంలో కరీంనగర్‌లో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ నేతృత్వంలో ఆ పార్టీ నాయకులు శ్వేత, కల్పన, ప్రతిమ తదితరులు హోటళ్లలోకి సామాన్లు, ప్లేట్లు పగలగొట్టి ఆందోళన వ్యక్తం చేశారు. బంద్‌కు మద్దతివ్వకుండ ఎందుకు తెరిచారని ప్రశ్నించారు. అలాగే హైదరాబాద్‌లోని నల్లకుంట ప్రాంతంలో బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. బంద్‌ను పాటించకుండా తెరిచి ఉన్న బజాజ్ షోరూంతో పాటు రాఘవేంద్ర టిఫిన్ సెంటర్‌పై ఆందోళనకారులు పెద్ద సిమెంట్ బ్లాక్స్‌తో దాడి చేశారు. దీంతో షోరూం అద్దాలు ధ్వంసమయ్యాయి. అంతేకాక తెరిచి ఉన్న పెట్రోల్ బంక్‌పై దాడి చేసి ఫ్యూయల్ మెషిన్లను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.





బీసీల బంద్‌లో పాల్గొన్న టీఎస్ఐఐసీ ఛైర్‌పర్సన్ నిర్మల రెడ్డి





శనివారం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు సంఘీభావంగా ఆదిలాబాద్ పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జీ కంది శ్రీనివాస్ రెడ్డి

## రాష్ట్రంలో బీజేపీ మద్దతిచ్చి.. కేంద్రంలో వెనకడుగు: మంత్రి పొన్నం

**హైదరాబాద్, మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై న్యాయస్థానాల్లో పోరాటాలు చేస్తామని, హైకోర్టులో త్వరలోనే అఫిడవిట్ దాఖలు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం ఆయన కాంగ్రెస్ నేతలతో కలిసి బీసీ ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కులగణన సర్వే నిర్వహించి బీసి రిజర్వేషన్ బిల్లును చట్టసభల్లో ఆమోదించామని అన్నారు. అనంతరం ఆ బిల్లు గవర్నర్ నుంచి రాష్ట్రపతి ఆమోదానికి వెళ్లిందన్నారు. మార్చి 30 నుంచి గవర్నర్ దగ్గరకు వెళ్లిన బిల్లులు ఇంత వరకు ఆమోదం పొందలేదన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు లేక రెండేళ్ల నుంచి కేంద్ర ప్రభుత్వ నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు, రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల ఆమోదంతోనే బీసీ బిల్లు ఆమోదం పొందిందని అన్నారు.

**బంద్ ప్రభావం కేంద్రంపై పడాలి..**

నిర్ణయం తీసుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండడం ఎంత వరకు కరెక్ట్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఇక న్యాయస్థానాల్లో పోరాటాలు చేస్తామని.. హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేస్తామని అన్నారు. బీసీ సంఘాలు జేఏసీగా ఏర్పడి మాదిగ దండోరా, మాల మహానాడు మద్దతుతో బంద్‌కు పిలుపునివ్వడం ప్రశంసనీయమని అన్నారు. రవాణా శాఖ మంత్రిగా అన్ని రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు బస్సులు కూడా బంద్ చేశాయని తెలిపారు. ప్రజలకు అసౌకర్యం కలుగుతున్నప్పటికీ అయినప్పటికీ బంద్ ప్రభావం కేంద్రంపై పడాలన్నారు. కేంద్ర మంత్రులుగా ఉన్న బండి సంజయ్, కిషన్‌రెడ్డి, మిగతా ఎంపీలంతా తెలంగాణ బలహీన వర్గాల ఆకాంక్షలను కేంద్రానికి చెప్పే ప్రయత్నం చేయాలన్నారు.





## మోడీ బీసీగా కన్వర్ట్ అయ్యారు

### బీసీ కాకపోయినా తన సామాజిక వర్గాన్ని బీసీలో చేర్చింది

### బీసీ బంద్ కార్యక్రమంలో మంత్రి తుమ్మల

**ఖమ్మం, మహా:** కులగణన ఆధారంగా బీసీల రిజర్వేషన్ల కోసం శాసనసభలో అన్ని పార్టీల ఆమోదం తీసుకొని హైకోర్టు, సుప్రీంకోర్టు ద్వారా న్యాయం కోసం ముందుకెళ్లామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సత్తుపల్లిలో చేపట్టిన బీసీ బంద్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ ప్రజల మనోభావాలకు తగ్గట్టుగా రాజ్యాంగబద్ధంగా అందరికీ సమన్యాయం జరిగి, రాజ్యాధికారం కల్పించాలనేదే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్దేశమని పేర్కొన్నారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు దేశ ప్రజల కోసం రాహుల్ గాంధీ పాదయాత్ర చేపట్టారని మంత్రి తుమ్మల గుర్తు చేశారు. గుజరాత్ రాష్ట్రంలో చట్ట సవరణ ద్వారానే ప్రధానమంత్రి మోదీ బీసీగా కన్వర్ట్ అయ్యారని మంత్రి తుమ్మల తెలిపారు. నరేంద్ర మోదీ కులం బీసీ కాకపోయినా అక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఆయన సామాజిక వర్గాన్ని బీసీలో చేర్చిందని పేర్కొన్నారు. బీసీగా ప్రధానమంత్రి స్థానం దక్కించుకున్న మోదీ, తెలంగాణలో బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# బీసీ బంద్.. వ్యూహాలు

*తెలంగాణలో బీసీ బంద్ విజయవంతం అయింది. తెలంగాణ రాజకీయాల్లో మళ్ళీ వేడి రగలింది. బీసీ రిజర్వేషన్ల అంశం ఇప్పుడు కేంద్ర–రాష్ట్రాల మధ్య తగువుకు దారితీస్తోంది. బీసీ బంద్‌తో రాజకీయంగా ఎవరికి లాభం, ఎవరికీ నష్టం అనే చర్చ మొదలైంది. బీసీ బంద్ కు అన్ని ప్రధాన పార్టీలు మద్దతిచ్చాయి. ఇంతకూ ఈ రిజర్వేషన్లు ఇచ్చేది ఎవరు? ఇచ్చేవారే ధర్నాలో కూర్చుంటే అది మొక్కుబడి వ్యవహారమా? నిజాయితీనా? వ్యూహమేంటో తేలాల్సి ఉంది. రాజకీయ నష్టనివారణ వ్యూహంలా కనబడుతోంది. చిత్తశుద్ధితో అందరూ ప్రయత్నిస్తే బీసీ రిజర్వేషన్ల సాధన కష్టం కాదు. రాజకీయాల విషయానికొస్తే తెలంగాణలోని మూడు ప్రధాన పార్టీలకు అంతర్గత సమస్యలున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితం రాష్ట్ర రాజకీయ దిశను పూర్తిగా మార్చే అవకాశం కనిపిస్తోంది. - తెలంగాణలో తాజా రాజకీయ పరిణామాలపై ఏఏన్ఎన్ సీఈవో, జర్నలిస్ట్ కంది రామచంద్రారెడ్డి వీకెండ్ అనాలసిస్*



కంది రామచంద్రారెడ్డి
వీకెండ్ అనాలసిస్

తెలంగాణ రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్లు ప్రకంపనలు పుట్టిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వరుసగా చేసిన ప్రయత్నాల వల్ల బీసీ రిజర్వేషన్ల నినాదానికి, హక్కుగా మద్దతు పెరిగింది. బీసీ సంఘాల్లో ఎన్నడూ లేనంత ఐక్యత కనిపిస్తోంది. బీసీ రిజర్వేషన్లు పార్లమెంట్ ద్వారానే సాధ్యమైనా.. డిమాండ్ కు అన్ని రాజకీయపక్షాల మద్దతు లభించడం పెద్ద ముందడుగు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని గత ఏడాదిన్నర కాలంగా లైవ్ ఉంచడంతో పాటు వివిధ రకాల ప్రయత్నాలు చేయడంలో కాంగ్రెస్ విజయవంతమైంది. బీసీ రిజర్వేషన్లు ఇచ్చే అధికారం రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో లేకున్నా.. రాష్ట్రస్థాయిలో చేయాల్సిన ప్రయత్నాలు రాజకీయ ఇబ్బందులు పక్కనపెట్టి మరీ కాంగ్రెస్ చేసింది. శనివారం జరిగిన రాష్ట్ర బంద్ కు బీజేపీ మద్దతు ప్రకటించడంపై కాంగ్రెస్, వామపక్షాలు విస్తుపోతున్నాయి. అసలు.. ఇవ్వాల్సింది కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమే కదా. మీరు రాష్ట్రబంద్ కు మద్దతివ్వడమేంటని కాంగ్రెస్ మంత్రులు ప్రశ్నిస్తున్నారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమానికి మద్దతు ఇవ్వకుండా ఉండలేని అనివార్యసంకట స్థితి బిజెపికి ఏర్పడింది. బీసీ బంద్ తో ఢిల్లీకి సెగతగలాలని బీజేపీ ఎంపీ ఆర్. క్రిష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు రిజర్వేషన్లు రావాల్సిందేనని బీజేపీ చీఫ్ రామచందర్ రావు, ఎంపీ ఈటల రాజేందర్ లు అంటున్నారు. ఇవ్వాల్సింది ఎవరో.. బీసీ సంఘాల పోరాటం ఎవరిమీదోనన్న ప్రశ్నలకు సమాధానాలు తెలియక కాదు. రాజకీయ అనివార్యత. కేంద్రం స్పందిస్తే తప్ప, పార్లమెంట్ 9వ షెడ్యూల్ లో చేర్చితే తప్ప బీసీలకు రిజర్వేషన్లపై అధికారిక ముద్ర సాధ్యం కాదు. బీసీ బంద్ విజయవంతం, బీసీలంతా రాజకీయాలు పక్కనపెట్టి ఏకతాటిపైకి రావడం బీసీ రిజర్వేషన్ల సాధనదిశగా శుభపరిణామమే.



తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన పార్టీల పరిస్థితి అంతర్యుద్ధాలతో పైకి నవ్వులు.. లోన గాయాలు అన్న చందంగా ఉంది. ఎవరి సమస్యలు వారికి ఉన్నాయో. బయటివారు అవసరం లేదు.. సొంతపార్టీ సవాళ్ళతోనే నేతల తలలు బొప్పి కడుతున్నాయి. ప్రత్యర్ధి చిక్కుల్లో ఉన్నాడు.. ఇక మనకు ఎదురులేదు అనుకునే స్థితి లేకుండానే ఇంకో పార్టీలో బాహాబాహీలు మొదలవుతున్నాయి. తెలంగాణలో ముందెన్నడూ లేనివిధంగా పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం మీడియా మైకుల సాక్షిగా, మీటింగ్ ల సాక్షిగా ఫేస్ టు ఫేస్ ఛాలెంజ్ లు విసురుతోంది. బీఆర్ఎస్ పార్టీలో కవిత కల్లోలం షాక్ కు గురిచేసింది. తండ్రి పార్టీ అధినేతగా ఉన్నా కుమార్తెను ఏకంగా పార్టీనుండి బహిష్కరించడం సంచలనమే. అదీ ముఖ్యమంత్రిగా, తెలంగాణ ఉద్యమసారధిగా పనిచేసిన కేసీఆర్ కుటుంబంలో జరగడం పెద్ద సంఘటనే. హరీష్ రావు లాంటి కీలకనేత మీద కవిత సంచలన ఆరోపణలు చేసినా.. తర్వాత ఈ ఉపద్రవాన్ని తట్టుకుని బీఆర్ఎస్ మళ్ళీ ఎప్పటిలా కోలుకున్నట్లు కనబడుతోంది. బీఆర్ఎస్ పరిణామాలు చూసి వినోదించిన పార్టీల్లోనూ పరిస్థితులు ఏమంత బాగాలేవని బిజెపిలోని పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, బీజేపీ ఎంపీలు కొండా విశ్వేశ్వరరెడ్డి, ధర్మపురి అరవింద్ లు సందర్భం దొరికినపుడడల్లా పార్టీనేతలపై వాగ్బాణాలు నేరుగా ఎక్కుపెడుతున్నారు. ఇక బిజెపికి గతంలో ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న రాజాసింగ్ .. కేంద్రమంత్రి, రాష్ట్ర పార్టీ కీలకనేత కిషన్ రెడ్డిపైనే నేరుగా విమర్శలు చేస్తున్నారు. బిజెపికి గుడ్ బై చెప్పినా.. ఏ పార్టీలో చేరకుండా నాయకత్వ వైఫల్యాలపై ప్రశ్నాస్త్రాలు సంధిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎంత మెజారిటీతో ఓడిపోతున్నారు అని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇకకేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ ల మధ్య విభేదాలు, వైరుధ్యాలు బహిరంగమే. సందర్భం చిక్కినపుడల్లా ఒకరిపై ఒకరు పరోక్ష విమర్శలు చేస్తున్నారు. ఇక ధర్మపురి అర్వింద్ కూడా కిషన్ రెడ్డిపై పరోక్షంగా వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. బిజెపిలో ఎంపీలు, ఎమ్మెల్యేలకు గ్యాప్ ఉంది. ఎమ్మెల్సీలకు గ్యాప్ ఉంది. నేతలకు, క్యాడర్ కు గ్యాప్ ఉంది. ఎంపీకి, జిల్లా అధ్యక్షుడికి మధ్య జరిగిన కొట్లాటలో చివరికి బిజెపి హైకమాండ్ ఓ జిల్లా అధ్యక్షుడిని తొలగించాల్సి వచ్చింది. ఇక స్వేచ్ఛ అధికంగా ఉండే కాంగ్రెస్ పార్టీలోనూ ఇటీవల కాలంలో మంత్రుల చిటపటలు హైకమాండ్ కు తలనొప్పిగా మారాయి. పొన్నం ప్రభాకర్ అడ్లూరి లక్ష్మణ్ వివాదం సమసిపోగానే. అడ్లూరి లక్ష్మణ్ వివేక్ వివాదం, అది సమసిపోగానే కొండా సురేఖ, పొంగులేటి పంచాయతీ, ఆ తర్వాత మరిన్ని మలుపులు తీసుకున్నాయి. చివరకు హైకమాండ్ జోక్యం చేసుకునేదాకా వచ్చి వివాదం సద్దుమణిగింది. రాజకీయపార్టీల్లో అంతర్యుద్ధాలు కామన్ గా మారగా, ప్రత్యర్థులను ఈ యాంగిల్ లో విమర్శించలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ వివాదాలు.. విభేదాలు ఆయా రాజకీయపార్టీలపై భవిష్యత్తులో మరింతగా ప్రభావం చూపితే ఇబ్బందులు తప్పవు,

గూగుల్ డేటా సెంటర్ తో ఏపీ రాతమారిపోయిందన్నట్లుగా, ప్రతీ ఇంట్లోకి గూగుల్ క్యాంపస్ వచ్చేసిందా అన్నంతగా ప్రచారం జరుగుతోంది. ఏపీకి గూగుల్ డేటా సెంటర్ రావడం శుభ పరిణామమమే. దీని వెనుక మంత్రి నారాలోకేష్ కృషి ఉంది. ఏపీ లాంటి రాష్ట్రానికి లక్ష కోట్ల పెట్టుబడి రావడం అద్భుతమే. చంద్రబాబు విజన్ లోకేష్ కూడా అందిపుచ్చుకున్నట్లు చెబుతున్నారు. ప్రధాని మోదీ లోకేష్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఇది ఆర్థికంగా ఏపీ రాష్ట్రానికి ఉపయోగపడుతుంది. అయితే కర్నాటక రాష్ట్రం 22వేల కోట్ల రాయితీలు ఇవ్వలేక తాము గూగుల్ డేటా ను వదులుకున్నాయని, కంపెనీ వచ్చిందా.. లేక కంపెనీలో ఏపీ రాష్ట్రం పెట్టుబడి పెట్టిందా అని కన్నడ మంత్రులు ఏపీ పై సెటైర్లు వేస్తున్నారు. డేటా సెంటర్ లో 200 నుండి 500 ఉద్యోగాలు వస్తాయని వైసీపీ, బీజేపీ వర్గాలు అంటున్నాయి. ఉద్యోగాల అంశం కాకున్నా.. గూగుల్ రావడం వల్ల మరిన్ని కంపెనీలు హాలో విశాఖ అనే అవకాశముంది. ఏపీలో పెట్టుబడులపై ఇంత ప్రచారం జరుగుతున్నా.. తెలంగాణ ప్రభుత్వం స్పందించకపోవడం, హైదరాబాద్ లో ఇప్పటికే ఆరు డేటా సెంటర్లు నిర్మాణం చివరిదశకు చేరిన అంశం కూడా చెప్పకపోవడం దారుణమని తెలంగాణ పారిశ్రామికవేత్తలు, యువత అంటున్నారు. అన్నీ ఉన్నా ప్రచారంలో సున్నాగా తెలంగాణను చేస్తున్నారని, తెలంగాణ ప్రభుత్వం ఈ విషయంలో అప్రమత్తంగా లేకుంటే ప్రచార ఒరవడిలో కొత్త కంపెనీలు అటు చూసే ప్రమాదాలు ఉంటాయని పలు కంపెనీల యాజమానులు అంటున్నారు. వాస్తవానికి హైదరాబాద్ దేశంలోనే ఐటీ ఉత్పత్తుల్లో అగ్రగామిగా దూసుకుపోతోంది. రాష్ట్ర ఇమేజ్ కు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ద్రుష్టిపెట్టాలన్న వినతులు అందుతున్నాయి. హైదరాబాద్ లో ప్రస్తుతం 3 మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్లు, 3 అమెజాన్ డేటా సెంటర్లు , ఎయిర్ టెల్, కంట్రోల్ ఎస్, ఇలా 11బిలియన్ల డాలర్లపెట్టుబడుల డేటా సెంటర్లు ఉన్నాయి. ఆరు డేటా సెంటర్ల నిర్మాణం 80 శాతానికి పైగా పూర్తయింది. మౌలిక వసతుల్లో, నిపుణుల్లో, వాతావరణ పరిస్థితుల్లో, పారిశ్రామిక ఆరోగ్య వాతావరణంలో హైదరాబాద్ ఇండియాలోనే బెస్ట్ గా ఉంది.

జూబ్లీహిల్స్ పోరుపై స్పష్టత వచ్చింది. మూడుప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మూడు పార్టీలలో బీసీకి టికెట్ ఇచ్చింది ఒక్క కాంగ్రెస్ పార్టీనే. స్థానిక యువకుడు నవీన్ యాదవ్ కు ఎంఐఎం అధినేత అసద్ మద్దతు ప్రకటించారు. బీఆర్ఎస్ సెంటిమెంట్ ను నమ్ముకుని రాజకీయం చేస్తోంది. నవీన్ యాదవ్ నామినేషన్ ర్యాలీ అట్టహాసంగా జరగ్గా, అధికారంలో ఉండడం కాంగ్రెస్ పార్టీకి అడ్వాంటేజ్ గా మారింది. బీసీ ఉద్యమం తీవ్రంగా జరుగుతున్న సమయంలో బీసీకి కాకుండా ఇతర సామాజిక వర్గాలకు టికెట్ ఇవ్వడంలో బీఆర్ఎస్, బీజేపీల వ్యూహం స్పష్టమవుతోందని నేతలు అంటున్నారు. గ్రౌండ్ ను కూడా అనుకూలంగా మలుచుకున్న పార్టీకే విజయం లభిస్తుంది.

రచనలకు ఆహ్వానం
ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరు తెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp: 74369 39999

# సీతక్కపై బీఆర్ఎస్ కుట్రలు





- పాతులోతు పాండు నాయక్
9885333196

తెలంగాణ క్యాబినెట్‌లో కీలక స్థానంలో ఉన్న గిరిజన మహిళా నేత సీతక్కపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలు, వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ఒక మహిళా ప్రజాప్రతినిధి, ముఖ్యంగా గిరిజన మహిళా నేత క్యాబినెట్‌లో ఉండడం బీఆర్ఎస్ నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. తమ పరాజయానికి కారణమైన వారిపై వ్యక్తిగత విమర్శలు చేయడమే వీరి పనిగా పెట్టుకున్నారు. సీతక్క నిజం చెప్పినందుకే బీఆర్ఎస్ నేతలు విషం చిమ్మడం దారుణం! తెలంగాణ రాజకీయాల్లో నిజాయితీ, ధైర్యం అనే పదాలకు పర్యాయపదంగా నిలిచే నాయకురాలు సీతక్క. ఆమె పనితీరు, ప్రజలతో ఆమెకున్న అనుబంధం గురించి రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసు. క్షేత్ర స్థాయిలో ప్రజల కష్టాలను, సమస్యలను దగ్గరగా చూసి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేసే నాయకురాలిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆమె మాటల్లో ఎప్పుడూ ఒక పదును, నిష్కర్ష కనిపిస్తుంది. సీతక్క ఎప్పుడూ ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడి... బండలు సైతం పగిలే నిజాలు మాట్లాడతారు. అందుకే ఆమెను ప్రజలు ఆదరించారు, అత్యధిక మెజారిటీతో గెలిపించారు. ప్రజల కష్టాలను, వాస్తవాలను బయటపెట్టి, వాటికి పరిష్కారం చూపడానికి ఆమె చేస్తున్న కృషిలో నిజాయితీ స్పష్టంగా కనిపిస్తుంది. సీతక్క గురించి, ఆమె పనితీరు గురించి ప్రజలకు బాగా తెలుసు. ఆమె ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడి... బండలు సైతం పగిలే నిజాలు మాట్లాడతారు. అందుకే ఆమెను ప్రజలు ఆదరించారు. ప్రజల కష్టాలను, వాస్తవాలను బయటపెట్టి, వాటికి పరిష్కారం చూపడానికి కృషి చేస్తున్న సీతక్క మాటల్లో ఎప్పుడూ నిజాయితీ ఉంటుంది. అయితే, ఈ నిజాయితీనే ఇప్పుడు బీఆర్ఎస్ నేతలకు మింగుడుపడటం లేదు. ఆమె మాటల్లోని వాస్తవాలను, ప్రజల పట్ల ఆమెకున్న నిబద్ధతను చూసి ఓర్వలేక, ఆమెపై వ్యక్తిగత దాడికి దిగుతున్నారు. నిజం చెప్పినా రాజకీయం చేయడం బీఆర్ఎస్ నేతలకు వెన్నతో పెట్టిన విద్య. ప్రజా సమస్యలు, లోపాల గురించి సీతక్క మాట్లాడితే, వెంటనే దాని వెనుక ఏదో 'కుట్ర' ఉందనో, 'రాజకీయం' ఉందనో ఆరోపణలు గుప్పించి పక్కదారి పట్టించడమే వారి పని. ఏ విషయం మాట్లాడినా, దాని వెనుక ఏదో రాజకీయం ఉందని ఆరోపణలు గుప్పిస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వారి నైజంగా మారింది. తెలంగాణ రాజకీయాల్లో ప్రజాసేవ అంటే ఏమిటో నిరూపిస్తున్న నాయకురాలు సీతక్క. ఆమె ప్రజా జీవితం, పదవి పట్ల ఆమెకున్న అపారమైన నిబద్ధత ప్రజలకు బాగా తెలుసు. ఆమె తన జీవితాన్ని, పదవిని నిస్వార్థంగా ప్రజలకు అంకితం చేశారు. అందుకే ఆమె నిస్సందేహంగా, ధైర్యంగా ఒక మాట చెప్పగలుగుతున్నారు: "తప్పు చేస్తేనే భయపడతాను.. సీతక్క తన మనసాక్షితో పనిచేస్తారు" అని. ఈ మాటల్లోనే ఆమె చిత్తశుద్ధి, నిజాయితీ దాగి ఉన్నాయి. అధికారం అన్నా, పదవి అన్నా లాలూచీ పడకుండా, తన మనసాక్షికి కట్టుబడి పనిచేసే నాయకురాలిపై అవాస్తవ ఆరోపణలు గుప్పించడం ఎంతవరకు సమంజసం? ఆమె సేవ కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న మారుమూల ప్రాంతాలకు, గిరిజన తండాలకు ఆమె నిరంతరం చేరువవుతూనే ఉంటారు. అడవులు, వాగులు, వంకలు దాటి గిరిజనుల సమస్యలను తీర్చే ఆమె నిరంతర కృషిని యావత్ రాష్ట్రం చూసింది. ఇంతటి అంకితభావంతో పనిచేస్తున్న నాయకురాలిపై, వ్యక్తిగత లాభాపేక్ష లేకుండా నిస్వార్థంగా ఉంటున్న వ్యక్తిపై ఇలాంటి నిందలు వేయడం ఎంతవరకు సమంజసం? నిజానికి, నిష్కపటమైన సేవను జీర్ణించుకోలేని బీఆర్ఎస్ నేతలే ఆమెపై బురదజల్లుతున్నారనేది స్పష్టం. రాజకీయం చేయడం, దిగజారి మాట్లాడడం అలవాటైన వారికి, సీతక్క యొక్క నిజాయితీ కఠిన సత్యంగా కనిపిస్తోంది.

**ప్రతి అంశం రాజకీయం... పబ్బం గడుపుకోవడం కోసమే..**

తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్న రాజకీయ విధానం విమర్శలకు దారితీస్తోంది. నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన నేతలు, కేవలం వ్యక్తిగత దూషణలకు, అవాస్తవ ఆరోపణలకే పరిమితం కావడం దారుణం. నిజానికి, దిగజారి మాట్లాడడం... రాజకీయం చేయడం... ఆరోపణలు చేయడమే బీఆర్ఎస్ నేతల నైజంగా మారిపోయింది. పాత వైభవం కోల్పోయిన తర్వాత, తమ ఉనికిని కాపాడుకోవడానికి, పక్కదారులు పడుతున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో ఏ చిన్న విషయం జరిగినా, అది ప్రజల సమస్యైనా, రాజకీయ నేతల వ్యక్తిగత అభిప్రాయమైనా... బీఆర్ఎస్ నేతలు దానిని వెంటనే రాజకీయం చేస్తున్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ, ఎదుటివారిపై అవాస్తవ ఆరోపణలు గుప్పించి, పబ్బం గడుపుకోవడమే వారికి తెలుసు. సమస్యల పరిష్కారం కంటే, తమ పార్టీ అజెండాను ముందుకు తీసుకెళ్లడానికే వీరు ప్రాధాన్యత ఇస్తున్నారు. వారి విమర్శల్లో హుందాతనం, సంస్కారం పూర్తిగా లోపించింది. సంస్కారం లేకుండా బట్ట కాల్చి మీదేయడమే వారి నైజంగా మారిపోయింది. ఆధారాలు లేకుండా, కేవలం అనుమానాలు, అబద్ధాల ఆధారంగా నిష్కళంకమైన నాయకులపై బురద జల్లడం, ప్రజల్లో గందరగోళం సృష్టించడం వారికి వెన్నతో పెట్టిన విద్యగా మారింది. నిజాయితీ, చిత్తశుద్ధితో పనిచేసే నాయకురాలిపై పదేపదే వ్యక్తిగత విమర్శలు, నిందారోపణలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు ప్రజలను మోసం చేయలేవు. సమస్యలపై నిర్మాణాత్మక సూచనలు ఇవ్వడం, ప్రభుత్వాన్ని ప్రజలకు అనుకూలంగా నడిపించడంలో సహకరించడం మానేసి, కేవలం అబద్ధాలు, ఆరోపణలతో కాలం వెళ్లదీయడం బీఆర్ఎస్ నేతల భవిష్యత్తుకే ప్రమాదకరం. వారు ఇకనైనా తమ వైఖరిని మార్చుకుని, బాధ్యతాయుతమైన ప్రతిపక్షంగా వ్యవహరించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

**నిర్మాణాత్మక ప్రతిపక్షం ఎక్కడ?:**

బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షంపై ప్రతిపక్షం విమర్శలు గుప్పించడం అత్యంత సహజం మరియు ఆరోగ్యకరమైన అంశం. ప్రభుత్వాన్ని ప్రశ్నించడం, లోపాలను ఎత్తిచూపడం ప్రతిపక్షం యొక్క ప్రాథమిక బాధ్యత. అయితే, తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్న తీరు, ఆ బాధ్యతకు పూర్తిగా విరుద్ధంగా ఉంది. బీఆర్ఎస్ నేతల విమర్శలు నిర్మాణాత్మకంగా ఉండటం లేదు. అవి సమస్యలను పరిష్కరించడం కంటే, కేవలం వ్యక్తిగత ద్వేషం, రాజకీయ కక్ష సాధింపు ధోరణిని ప్రతిబింబిస్తున్నాయి. ముఖ్యంగా, ఒక మహిళా నేత చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ, ఆమెపై వ్యక్తిగత దాడికి దిగడం అత్యంత అభ్యంతరకరం. నిస్వార్థంగా పనిచేసే ఒక ప్రజాప్రతినిధి నిజాయితీని, అంకితభావాన్ని కేవలం రాజకీయ లబ్ధి కోసం తప్పుపట్టడం ఏ మాత్రం శ్రేయస్కరం కాదు. ప్రతి అంశాన్ని రాజకీయం చేస్తూ, దిగజారి మాట్లాడడం బీఆర్ఎస్ నేతల నైజంగా మారిందనే విమర్శలు బలంగా ఉన్నాయి. ఇలాంటి దిగజారుడు రాజకీయాలు రాష్ట్ర ప్రజలను విసిగిస్తున్నాయి. ప్రజలకు కావాల్సింది బురద జల్లుకునే రాజకీయం కాదు, సమస్యల పరిష్కారం. అందుకే, బీఆర్ఎస్ నేతలు తమ దిగజారుడు రాజకీయాలు మానుకుని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని, ప్రతిపక్షం అంటే, ప్రజల పక్షాన నిలబడి, ప్రభుత్వాన్ని సరైన మార్గంలో నడిపించే దిక్సూచిలా ఉండాలి. వ్యక్తిగత ప్రతిష్టను దిగజార్చే ఆరోపణలు, హుందాతనం లేని విమర్శలు చేయడం ద్వారా బీఆర్ఎస్ నేతలు తమ విశ్వసనీయతను కోల్పోతున్నారు. ఇకనైనా వారు తమ వైఖరిని మార్చుకుని, బాధ్యతాయుతమైన రాజకీయ విలువలను పాటించాలని ప్రజలు ఆశిస్తున్నారు.

**ఇకనైనా నిర్మాణాత్మక పాత్ర పోషించండి!**

రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత దురదృష్టకరం ఏమిటంటే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్ నేతలు అనుసరిస్తున్న బురద జల్లే రాజకీయం. తమ పరాజయానికి గల కారణాలను విశ్లేషించుకుని, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా మారాల్సిన నేతలు, కేవలం వ్యక్తిగత ద్వేషం, నిందారోపణలకే పరిమితమవుతున్నారు. వాస్తవాలను, చేదు నిజాలను అంగీకరించలేని వైఖరి బీఆర్ఎస్ నేతలకు శాపంగా మారింది. ప్రజల తరపున గళమెత్తి, నిస్వార్థంగా పనిచేస్తున్న నాయకురాలిని విమర్శించడం వారి నైజంగా మారింది. నిష్కపటంగా పనిచేసే నాయకురాలిపై బురద జల్లడం ద్వారా, ఆమె నిజాయితీని శంకించడం ద్వారా తాము ఏదో సాధిస్తామనుకుంటే పొరపాటే. నిజాయితీగా, మనస్సాక్షికి కట్టుబడి పనిచేస్తున్న నాయకురాలిని విమర్శించే బదులు, ఆ ప్రజాప్రతినిధికి ప్రజల్లో ఉన్న ఆదరణకు గల కారణాలను బీఆర్ఎస్ నేతలు విశ్లేషించుకోవాలి. అబద్ధాలు, ఆరోపణలు, దిగజారుడు రాజకీయాలు కాకుండా, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించడం నేర్చుకోవాలి. ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్నారు. కేవలం మీడియా దృష్టిని ఆకర్షించడం కోసం అవాస్తవ ఆరోపణలు గుప్పించడం ద్వారా ఇలాంటి దిగజారుడు రాజకీయాలతో ప్రజలను మోసం చేయలేరని వారు గుర్తించాలి. రాష్ట్రానికి అవసరమైన సామాజిక, ఆర్థిక సమస్యలపై దృష్టి సారించి, ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి. వ్యక్తిగత కక్ష సాధింపు ధోరణిని వీడి, ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయడమే ఈ తరుణంలో బీఆర్ఎస్ నేతలకు అత్యవసరం. లేదంటే, వారి రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంలో పడడం ఖాయం. బీఆర్ఎస్ నేతలు ముందుగా నిస్వార్థ సేవకు, రాజకీయ లబ్ధికి మధ్య తేడాను గుర్తించాలి. వ్యక్తిగత ప్రయోజనాలను ఆశించకుండా, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న నాయకురాలిపై నిందలు వేయడం ద్వారా, తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవాలని ప్రయత్నించడం దారుణం. నిజానికి, ఆ మహిళా నేత ఎన్నో కష్టాలను అధిగమించి ప్రజా జీవితంలో ఉన్న వ్యక్తి. ఆమె పోరాట పటిమ, నిబద్ధత ప్రజా జీవితంలో ఆమె స్థానాన్ని సుస్థిరం చేశాయి. అలాంటి నాయకురాలి పట్ల హుందాతనం లేకుండా వ్యవహరించడం బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం తగదు. వారి విమర్శల తీరు చూస్తుంటే, ప్రజలకు సేవ చేయాలనే నిబద్ధత కంటే, కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే ఆరాటమే ఎక్కువ కనిపిస్తోంది. నిస్వార్థ సేవకు, రాజకీయ లబ్ధికి మధ్య తేడాను వారు గుర్తించాలి. నిష్కళంకమైన నాయకత్వానికి మద్దతు ఇవ్వలేకపోయినా ఫర్వాలేదు, కనీసం నిందలు వేయడం, ఆమె చిత్తశుద్ధిని శంకించడం మానుకోవాలి. హుందాతనం లేని ఈ దిగజారుడు రాజకీయాలను ప్రజలు తిప్పికొడతారు. ఇకనైనా బీఆర్ఎస్ నేతలు తమ విమర్శల స్థాయిని పెంచుకుని, రాష్ట్ర ప్రగతికి తోడ్పడే నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# మున్నూరు కాపుల ధర్నాతో దద్దరిల్లిన జంక్షన్

## జనాభాలో మేమెంతో మాకంత వాటా కావాలి.. 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధంగా అమలు చేయాలి




**వరంగల్ మహా;** అన్ని రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో బిసిలుగా మేమెంత మంది ఉన్నామో మాకు అంత వాటా కావాలని బిసిలలో అత్యధిక సంఖ్యలో ఉన్నటువంటి మున్నూరు కాపులు నినదించారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం నిర్వహిస్తున్న బీసీ బంద్ లో భాగంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని మున్నూరు కాపులంతా కలిసి వరంగల్ పోచమ్మ మైదాన్ జంక్షన్ లో భారీ ధర్నా చేపట్టడం తోపాటు మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు రాష్ట్ర నాయకులు గడ్డం రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కావాలని తీర్మానం చేసిందని దీనిని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటు లో ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్ లో పెట్టాలని డిమాండ్ చేశారు. వరంగల్ తూర్పు నియోజకవర్గం మున్నూరు కాపు కోఆర్డినేటర్ పోతు కుమారస్వామి మాట్లాడుతూ సర్పంచులు, ఎంపీటీసీ పదవులే కాకుండా శాసన సభ, పార్లమెంట్ లో కూడా 42% సీట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర మున్నూరు కాపు యువత అధ్యక్షులు నీలం రాజు కిషోర్ మాట్లాడుతూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం బీసీలకు రిజర్వేషన్లు కావాలని అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసిన తర్వాత కొందరు రెడ్డిలు దీనికి వ్యతిరేకంగా హైకోర్టులో కేసు వేసి 42 శాతాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం వల్లనే ఈ సమస్య ఉత్పన్నమైందని బీసీలు ఎంతమంది ఉన్నారో అంతమందికి వారికి వచ్చే వాటా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందని స్పష్టం చేశారు. బిసిలకు రాజకీయంగా, సామాజికంగా న్యాయం జరగాలంటే జనాభా నిష్పత్తి ప్రకారం సర్పంచ్ ఎంపీటీసీ జడ్పిటిసి తో పాటు ఎంపీ, ఎమ్మెల్యే, కార్పొరేటర్ల సీట్లలో 42 శాతం పక్కాగా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇది జరగాలంటే దేశ వ్యాప్తంగా కుల గణన సత్వరమే పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వేను కేంద్రం పరిగణలోకి తీసుకుని శాసన సభ ఆమోదించిన 42% శాతం రిజర్వేషన్లు వెంటనే గవర్నర్ ఆమోదించాలి. రాజ్యాంగంలోని 9 వ షెడ్యూల్ లో చేర్చి రక్షణ కల్పించాలి. గ్రామాల్లో పట్టణాల్లో గెలువగానే రాజకీయంగా అధికారంలో వాటా వచ్చినట్టు కాదు శాసనాలు చేసే చట్ట సభలల్లో శాసనసభలో పార్లమెంటులో బి సి లు పూర్తిస్థాయిలో ఎన్నిక కావాలని సమాజం కోసం , మన వాటా కోసం పోరాటాలు చేస్తూనే బిసిలకు న్యాయం జరుగుతుందని ఇందు కోసమే బీసీలందరూ పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇప్పటికే పార్లమెంటులో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు చట్టం చేశారు, కాని దాని వలన బిసి మహిళలు పార్లమెంటుకు పోయే అవకాశాలు లేవని రిజర్వేషన్లు లేకపోవడం వల్ల మళ్లీ ఆధిపత్య కుల మహిళలే చట్టసభలకు వెళ్తున్నారు. ఎస్సీ మహిళలు సుమారు 32 మంది ఎస్టీ మహిళలు 10 మంది వరకు వెళ్తున్నారు బిసిలు మాత్రం వెళ్లరు ఎందుకు అంటే శాసన సభ పార్లమెంటులో బిసి రిజర్వేషన్లు లేవు మన వాటా ప్రకారం పార్లమెంటు చట్టం చేస్తే 200 సీట్లకు పైగా బిసిలే ఉంటారని అందుకే దేశవ్యాప్తంగా కుల గణన చేయాలని బిసి రిజర్వేషన్ల చట్టం చేసేందుకు ప్రతి బిసి బిడ్డ పార్టీలకు అతీతంగా పోరాటం చేయాలి లేకుంటే ఆధిపత్య కులాలు మన వాటాను వాడుకొని మన పైనే పెత్తనం చేస్తాయి. మాట ఇచ్చిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్ కు నిధులు కేటాయించి మున్నూరు కాపు యూత్ కి ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తోట తిరుపతయ్య , కామిషెట్టి కోటేశ్వరమ్మ, డాక్టర్ హరి రమాదేవి, కెడల పద్మ జనార్ధన్, మేడిది మధుసూదన్, సాగర్ల శ్రీనివాస్ , కొరివి పరమేష్, మిరిపెల్లి రాజు, బండి రాజు, కర్నాల సత్యం, సూర రమేష్, కుందారపు రాజేందర్, పుప్పాల రమేష్, జూలూరి గంగాధర్, దామెర కొండ కర్ణాకర్, సోల రవి, కాశెట్టి వేణు, తోట బాలరాజు, నీలం సమ్మయ్య, సాంబరాజు వెంకటేశ్వర్లు, గజ్జి సురేష్, ఈద శ్రీనాథ్, మున్నూరు కాపు కుల బాంధవ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఘనంగా ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

## ధర్మకర్తల చేత ప్రమాణ స్వీకారం చేయించిన ఎమ్మెల్యే నాగరాజు



**హన్మకొండ మహా;** హన్మకొండ జిల్లా ఐనవోలు మండల పరిధిలోని కక్కిరాలపల్లి గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో ముఖ్య అతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చేత నూతన కమిటీ సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించి, చైర్మన్‌గా నియమించే కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే నాగరాజు కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా ఆహ్వానించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ప్రమాణం స్వీకారం చేసిన చైర్మన్ పబ్బతి సత్యనారాయణ ధర్మకర్తలు రావుల బిక్షపతి, నిమ్మని వేణుగోపాల్, కంచర్ల రజిత, కట్టబోయిన కుమారస్వామి లను ఎమ్మెల్యే సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో ఎమ్మెల్యే నాగరాజు ను శాలువాతో సత్కరించారు. తదనంతరం ఎమ్మెల్యే ఆలయ అభివృద్ధికి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట్ట మహేందర్ గౌడ్, ఐనవోలు ఆలయ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు ఫైండ్ల సంపత్, కాంగ్రెస్ నాయకులు పోలేపల్లి బుచ్చిరెడ్డి, మార్నేని వెంకటేశ్వరరావు, రావుల రవి, గద్దర్ సుమన్, మహేందర్, మండల మహిళా అధ్యక్షురాలు ఇల్లందుల ఎలీషా, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి సుధీర్, మధు, ఎడ్ల జగన్, ఐనవోలు మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కట్కూరి సునీల్, మండల, గ్రామ స్థాయి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు....



# నరకాసుర వధ ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ ఏఎస్పీ

## నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు

**వరంగల్ మహా;** దీపావళి పండుగ సందర్భంగా ఆదివారం నరక చతుర్దశి రోజున నరకాసుర వధ ఉత్సవ ఏర్పాట్లను స్థానిక మిల్స్ కాలనీ పోలీస్ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ నేతృత్వంలో ఈస్ట్ జోన్ డీసీపీ ఐపీఎస్ అంకిత్ కుమార్, వరంగల్ సబ్ డివిజన్ ఏఎస్పి శుభం ప్రకాష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి విచ్చేస్తున్న ప్రజలకు ప్రజా ప్రతినిధులకు ఇబ్బందులు కలగకుండా అన్ని విధాలా ఏర్పాట్లు చేయాలని ఈస్ట్ జోన్ డీసీపీ ఐపీఎస్ అంకిత్ కుమార్ నిర్వాహకులకు సూచించారు. శనివారం ఉర్సుగుట్ట కూడా ప్రాంగణంలో ఐపీఎస్ శుభం ప్రకాష్ మిల్స్ కాలనీ సీఐ బొల్లం రమేష్ నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి తో కలిసి ఉత్సవసభా స్థలాన్ని పరిశీలించి ఉత్సవాలకు విచ్చేసే నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలతో పాటు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మిల్స్ కాలనీ ఎస్ఐ నరేష్ శ్రవణ్ కుమార్, ఏఈ సుకృత, కమిటీ ప్రతినిధులు కనుకుంట్ల రవి మరుపల్ల గౌతమ్ అవునురీ రామ్మూర్తి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# బంద్ ఫర్ జస్టిస్

## హైదరాబాద్ బీజాపూర్ హైవే దిగ్బంధం



- చేవెళ్ల మండల కేంద్రంలో బంద్ విజయవంతం
- బీసీ రిజర్వేషన్ల వ్యతిరేకైనా బీజేపీని గద్దె దింపాలి
- సీపీఐ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కే రామస్వామి

**రంగారెడ్డి జిల్లా మహా:** బిసి జెఏసి చేపట్టిన 'బంద్ ఫర్ జస్టిస్' రాష్ట్ర బంద్ కు కాంగ్రెస్ సీపీఐ సిపిఎం బిఆర్ఎస్ బిజెపి, మరియు ప్రజా సంఘాల మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే రామస్వామి మట్లాడుతూ... బిసి రిజర్వేషన్ల సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు సాగాలని సూచించారు. బిసి బిల్లులను ఆమోదించి, రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందని స్పష్టం చేశారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీవోతో పాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ మీద నిన్న హైకోర్టు స్టే విధించడంతో, రిజర్వేషన్ల అమలు, స్థానిక సంస్థల ఎన్నికలు నిలిచిపోయాయి. దీనికి ప్రధాన కారణం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వమేనని. ఇప్పటికైనా రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు నైతిక బాధ్యత వహించి, వారి పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన, సర్వే నిర్వహించి, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు కేంద్రానికి పంపించినా స్పందించలేదన్నారు. శాసనసభలో అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించి ఆర్డినెన్స్ చేసి గవర్నర్కు పంపించినా ఆమోదించకపోవడం వల్లే రిజర్వేషన్లు ఆగిపోయాయన్నారు. బీజేపీ కులతత్వ, మనువాద పార్టీ అయినందున, కుల వ్యవస్థ, అసమానతలు ఉండాలని, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేయాలని కోరుకుంటుందని ఆరోపించారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రావాల్సిన హక్కులన్నింటినీ కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల పట్ల బీజేపీ కి చిత్తశుద్ధి ఉంటే తొమ్మిదివ షెడ్యూలులో చేర్చేందుకు రాజ్యాంగ సవరణ ద్వారా అవసరమైతే కేంద్ర ప్రభుత్వం తక్షణమే పార్లమెంటును సమావేశపరిచి, ఆ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రిజర్వేషన్లు 50 శాతం పరిమితి పేరుతో ఏళ్ల తరబడి బిసిల రిజర్వేషన్ పెంపు అంశాన్ని నాన్చడం ఏ మాత్రం తగదన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల(ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ వర్తింపులో ఈ పరిమితిని ఇప్పటికే దాటి పోయిన విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు. గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణీత కాల పరిమితి లోగా ఆమోదం లభించకపోతే, నోటిఫై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు. రాష్ట్రం నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ కేంద్ర మంత్రులు, ఎంపీలు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో బీజేపీ ఉండడం వల్లనే ఈ రోజు ఈ రిజర్వేషన్లు అమలు కాని పరిస్థితి ఏర్పడిందని, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీని భూస్థాపితం చేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ప్రభు లింగం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వడ్ల సత్య నారాయణ ఇన్సాబ్ జిల్లా అధ్యక్షుడు ఎండి మక్బుల్ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఎం సుధాకర్ గౌడ్, మండల పార్టీ కార్యదర్శి ఎం సత్తిరెడ్డి ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు శివ బిఓసి మండల నాయకుడు రామచందర్ పాపయ్య పెంటయ్య మండల మహిళా సమాఖ్య నాయకురాలు లలిత జయమ్మ వెంకటమ్మ స్వరూప చంద్రకళ భాగ్యమ్మ పాల్గొన్నారు



# పార్టీలకు, సంఘాలకు అతీతంగా రాజేంద్రనగర్

## నియోజకవర్గంలో బంద్ విజయవంతం

**రాజేంద్రనగర్ మహా ;** స్థానిక సంస్థల ఎన్నికల్లో, 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలనే లక్ష్యంతో, బీసీ సంఘాల ఐకాస ఇచ్చిన తెలంగాణ బంద్‌కు రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అపూర్వ మద్దతు లభించింది. స్వపక్షం విపక్షం అనే తేడా లేకుండా అన్ని పార్టీల నాయకులతో కలిసి శనివారం బంద్ లో పాల్గొన్నారు. రాజకీయ పార్టీలు, సంఘాలకు అతీతంగా అందరూ పాల్గొని బంద్‌ను విజయవంతం చేశారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బీసీ సంఘాలకు మద్దతుగా రంగంలోకి దిగారు. ఆయన అన్ని బిజెపి బిఆర్ఎస్ పార్టీల నాయకులు, కార్యకర్తలతో కలిసి అరంగర్ చౌరస్తా వద్ద ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్మాట్లాడుతూ, రిజర్వేషన్ల అంశాన్ని శాశ్వతంగా పరిష్కరించేందుకు, రాజ్యాంగంలోని 9వషెడ్యూల్‌లో చేర్చి, తక్షణమే చట్ట సవరణ చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. బీసీల హక్కుల పరిరక్షణ కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ బంద్‌లో నియోజకవర్గంలోని అన్ని రాజకీయ పక్షాల నాయకులు, కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని రిజర్వేషన్ల ఆవశ్యకతను తెలియజేశారు.

# ప్రశాంతంగా బంద్

## తెలంగాణ బంద్‌కు భారీ ఎత్తున మద్దతు



**ఆమనగల్లు, మహా :** తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కోరుతూ శనివారం చేపట్టిన తెలంగాణ బంద్‌కు భారీ ఎత్తున మద్దతు పెరిగింది. అన్ని రాజకీయపార్టీలు, బిసి సంఘాలు, ప్రజా సంఘాలు ముక్త కంఠంతో మద్ద తు ప్రకటించాయి. బిసిలంతా ఏకమై తొలిసారి చే పడుతున్న రాష్ట్ర బంద్‌కు కనీవినీ ఎరుగని మద్దతు వస్తోంది. 'బంద్ ఫర్ జస్టిస్' నినాదంతో మారుమోగింది.ఆమనగల్లు పట్టణంలో ఏర్పాటు చేసిన ధర్నాలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నిర్వహించిన ధర్నాలో మంత్రి జూపల్లి పాల్గొని మాట్లాడారు. తమిళనాడు లాగా షెడ్యూల్ తొమ్మిదిని సవరించి బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు పోరాడుదామన్నారు.బీసీలు విద్యా, ఉద్యోగ రాజకీయ రంగాల్లో తరతరాలుగా వెనుకబడిపోతున్నారని, రాహుల్గాంధీ ఆదేశాల మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి దేశానికి ఆదర్శవంతంగా కుల గణన చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కుల గణన నివేదిక ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని జీవో ద్వారా గవర్నర్కు పంపగా, బీసీ రిజర్వేషన్ల చట్టబద్ధత రాష్ట్రపతి దగ్గర పెండింగ్లో ఉందని, కేంద్ర ప్రభుత్వం అనుకుంటే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు దక్కుతాయి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చట్టపరంగా న్యాయపరంగా బీసీ రిజర్వేషన్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిందన్న విషయాన్ని ప్రతిపక్షాలు గమనించాలన్నారు.బీసీలపైకేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కట్టుబడి ఉందని అన్నారు.ఎమ్మెల్యే నారాయణరెడ్డి, జాతీయ ఓబిసి కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి, పిసిసి సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్, బీజేపీ, యువ సంఘాలు హాజరై మద్దతు ప్రకటించారు.

# చైతన్య డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ ప్రీ పీ.హెచ్.డి సెమిస్టర్ ఫలితాల విడుదల

## యూనివర్సిటీ ఛాన్సలర్ సి.హెచ్.వి పురుషోత్తం రెడ్డి అధికారికంగా విడుదల చేశారు




**మొయినాబాద్ మహా :** చైతన్య డిమ్డ్ టూ బీ యూనివర్సిటీ ప్రీ పీ.హెచ్.డి ఫస్ట్ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ సి.హెచ్.వి పురుషోత్తం రెడ్డి అధికారికంగా విడుదల చేశారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లో గల చైతన్య డీమ్ టూ బీ యూనివర్సిటీలో 2025 ఏప్రిల్ లో నిర్వహించిన పీ.హెచ్.డి మొదటి సంవత్సరం సెమిస్టర్ ఫలితాలను యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ సి.హెచ్.వి పురుషోత్తం రెడ్డి అధికారికంగా విడుదల చేశారు. 79 మంది విద్యార్థులు హాజరై 76 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత శాతం 96.2 శాతం నమోదయింది. ఉత్తీర్ణత విభాగాల వారిగా బయో కెమిస్ట్రీ 100 శాతం బయోటెక్నాలజీ 83. 33 శాతం, మైక్రో బయాలజీ 100 శాతం, కెమిస్ట్రీ 91.3 శాతం, కంప్యూటర్ సైన్స్ 100 శాతం, కామర్స్ మరియు బిజినెస్ మేనేజ్మెంట్ 100 శాతం, అగ్రికల్చర్ 100 శాతం, ఫిజియోథెరపీ 100 శాతం, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ 100 శాతం, ఎలక్ట్రికల్ మరియు ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 100 శాతం, మెకానికల్ ఇంజనీరింగ్ 100 శాతం, ఎలక్ట్రానిక్స్ మరియు కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ లో 100 శాతం, సివిల్ ఇంజనీరింగ్ 100 శాతం, ఫార్మసీ 100 శాతంలలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ సి.హెచ్.వి పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ..అధ్యాపకుల కృషివలనే విద్యార్థులు ఈ ఫలితాలు సాధించారని ఆయన అధ్యాపకులను కొనియాడారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల విజయాన్ని ఆయన ప్రశంసిస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలి

## వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలి.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద





**వరంగల్ మహా;** ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో శనివారం వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, డిప్యూటీ డిఎంహెచ్వోలతో జిల్లాలో వైద్య సేవల అందుబాటు, ప్రజారోగ్య పథకాల అమలు, ఆరోగ్య సదుపాయాల కల్పన పై కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔషధాల లభ్యత, వైద్యుల హాజరు, పరీక్షా పరికరాల వినియోగం, తల్లిశిశు సంరక్షణ వంటి అంశాలపై నిరంతర మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఎన్‌సీడీ సర్వే నిర్వహణ పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలని, ఏఎన్సి రిజిస్ట్రేషన్ మూడు చెకప్ లు తేదీల వారిగా చేయాలని అనవసరమైన సిజేరియన్ ఆపరేషన్ చేయకుండా గర్భిణీ స్త్రీలకు వారి కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ ప్రైవేటు డాక్టర్లు విధిగా సాధారణమైన ప్రసవాలు జరిగే విధంగా ప్రోత్సహించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా సంక్షేమ శాఖ సిబ్బందితో సమన్వయ పరుచుకోవాలని ఆసంక్రమిత వ్యాధుల వివరాలు ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలలో, ప్రాథమిక పట్టణ ఆరోగ్య కేంద్రాలలోని సిబ్బంది తప్పనిసరిగా ఆన్లైన్ చేయాలని సూచిస్తూ ఆన్లైన్ చేయని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. టీబి భారత్ ముక్తి మూర్చ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అర్హత కలిగిన వారందరినీ స్క్రీనింగ్ చేసి వారికి పరీక్షలు నిర్వహించి తగిన చికిత్సలు అందించాలని ముఖ్యంగా జిల్లాలో టీబి వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి తగిన పోషక ఆహారం తీసుకోవడంలో అవగాహన కల్పించాలని కోరారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 16 సంవత్సరాల వయసు కలిగిన బాల బాలికలందరికి వారి షెడ్యూల్ ప్రకారం ఇమ్యునైజేషన్ 100% ఇప్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ చికెన్ గునియా మెదడువాపు మొదలగు వ్యాధులను గుర్తించి తగిన చికిత్సలు అందించాలని, వ్యాధిగ్రస్తుల చుట్టుపక్కల వారిని స్క్రీనింగ్ చేసి వ్యాధి ప్రబలకుండా చూడాలని సూచించారు. జిల్లాలో నమోదైన కుష్టి వ్యాధి కేసులకు తగిన చికిత్సలు అందించి లెప్రసీ వ్యాధిగ్రస్తుల దగ్గర ఉన్న ఇంటి వారిని కూడా స్క్రీనింగ్ ద్వారా పరీక్షలు చేసి వ్యాధులు విస్తరించకుండా చూడాలన్నారు. వైద్యాధికారులు విధిగా సమయపాలన పాటించి సిబ్బందిని ప్రోత్సహించి తగిన ఫలితాలు రాబట్టాలని కోరారు. ప్రోగ్రాం అధికారులు లక్ష్యాలను సాధించాలని అలాగే జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాలు ప్రారంభించే ముందు ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. అనంతరం ఎంజీఎం, మున్సిపాలిటీ తో పాటు సంబంధిత శాఖల అధికారుల తో కలిసి మరో మారు సమావేశం నిర్వహిస్తామని ఈ సందర్భంగా కలెక్టర్ వారికి సూచించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మాట్లాడుతూ వైద్యులు కలెక్టర్ ఆదేశాలను తప్పక పాటిస్తామని సిబ్బంది సమయపాలన పాటించి తగిన ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రవీందర్, డాక్టర్ ఆచార్య, డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మోహన్ సింగ్, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బీసీలను మోసం చేస్తున్నది కాంగ్రెస్, బీజేపీలు

## తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం తాజా మాజీ ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజుల రవి యాదవ్

## 42 శాతం బీసీలకు కుల గణన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేస్తుంది



**మొయినాబాద్ మహా:** ప్రజలలో సభలలో నాయకులు మాట్లాడుతున్నది చెప్పేది ఒకటి చేసేది ఒకటి అన్న విధంగా దొందు దొందే అన్నట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం వివరిస్తుందని తెలంగాణ రాష్ట్ర తాజా మాజీ సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షురాలు ముదిగొండ మంజుల రవి యాదవ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో రాహుల్ గాంధీ ఏదో చెప్పారని కులగనన పేరుతో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ చేస్తామని దానిని అమలు చేయకుండా హైకోర్టు సుప్రీంకోర్టు పేర్లతో డ్రామాలు చేస్తూ బీసీలను మోసం చేయడానికి మోసపూరిత మాటలు చెప్పడం సరైనది కాదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం హిమాయత్ నగర్ లో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. .నేడు 42 శాతం అమలు కోసం బీసీ కుటుంబాలు రోడ్డుపై ఎక్కడానికి చేస్తున్న కుట్ర కాంగ్రెస్ ప్రభుత్వమేనని దుయ్యబట్టారు. ఇందుకు కారణం కులగనన అంటూ ఎవరికి న్యాయం చేయకుండా ప్రజలను మోసం చేస్తూ రెండు సంవత్సరాల పాటు ఎన్నికలు నిర్వహించకుండా కాలయాపయా చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ కాదా అని పేర్కొన్నారు. ఇప్పటికైనా గ్రామాలలో మున్సిపల్ ప్రాంతాలలో ఎన్నికలు నిర్వహిస్తే ఆ గ్రామాలు మున్సిపల్ ప్రాంతాలు అభివృద్ధితోపాటు ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు అన్ని పార్టీలు చూస్తున్నాయని ప్రభుత్వము కన్ను మూసుకొని పని చేస్తున్నామని అనుకోవడం కలగా బ్రహ్మ మరిచిపోవాలని పేర్కొన్నారు. ఇప్పటికైనా అన్ని ఎన్నికలు నిర్వహించి ప్రజలకు గ్రామాల అభివృద్ధి కోసం తోడ్పడేలా కృషి చేయాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థ ఎన్నికలు జరగకపోవడంతోనే గ్రామాలు కుంటుపడిపోయాయని అధికారులు అప్పుల పాలయ్యారని పాలన చేయాలంటేనే వెనుకడుగు వేస్తూ ప్రజలకు కనబడకుండా తిరుగుతున్న అధికారులను చూస్తున్న ప్రజలు అయ్యో పాపం అనే ధోరణితో వారిని పలకరిస్తూ అభ్యయంగా మీరేం చేస్తారులే అన్న విధంగా ప్రజలు అధికారులకు సహకరిస్తున్నారని పేర్కొన్నారు. బిసి కులగనన 42 శాతం రిజర్వేషన్ పేరుతో కాంగ్రెస్ పార్టీ కాలయాపన చేస్తూ ఎన్నికలు జరపకుండా రెండు సంవత్సరాలు గడిచిన నేటికీ గ్రామాలు బిక్కు బిక్కుమంటూ రోడ్లపై మురుగునీరు చెత్తాచెదారం గ్రామాలు అంధకారంలో వీధి దీపాలు లేక రాత్రివేళలో తిరగలేకపోతున్నారని ఆమె అన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా అర్థం చేసుకొని ఎన్నికలు జరిగే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇస్తూ బీసీలను రోడ్డుపై ఎక్కించడం ఇది ఎంతవరకు సమంజసం అని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వంలో బీసీ ప్రజా ప్రతినిధులు నాయకులు 42 శాతానికి సంఘీభావం తెలుపవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ ఏర్పాటు కాంగ్రెస్ పార్టీ చేసింది. మంచి పని అని ఆమె అభినందించారు. కానీ బీసీలను రోడ్లపై తీసుకురావడం ఎంతో బాధాకరంగా ఉందని తెలిపారు. 42 శాతం రిజర్వేషన్ బీసీలకు జాతీయస్థాయిలో దేశంలోనే అన్ని రాష్ట్రాలలో ఇదేవిధంగా అమలు చేసే విధంగా చూస్తే బీసీలు ఆశిస్తూ గర్జిస్తారని ఆమె ఆశించారు.



# అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మేయర్, ఎమ్మెల్యే

**హన్మకొండ మహా;** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి లో భాగంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ,నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి 58 వ డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి కాలనీ, శ్రీనగర్ కాలనీ,శ్రీ లక్ష్మి నగర్ కాలనీ తో పాటు రాఘవేంద్ర నగర్ లలో రూ.1.65 కోట్లతో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. చాలా ఏళ్లుగా పెండింగ్ లో పనులను అడిగిన వెంటనే పరిష్కరించిన ఎమ్మెల్యే నాయిని నీ కాలనీ వాసులు ప్రత్యేకంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.




# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిందే!

## స్థానిక సంస్థలలో బీసీలకు 42% రిజర్వేషన్ ఎమ్మెల్యే రంగారెడ్డి

**రంగారెడ్డి జిల్లా మహా:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ, బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్ర బంద్ ఇబ్రహీంపట్నంలో విజయవంతం అయ్యింది. వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు రోడ్డెక్కలేదు. ఆర్టీసీ కార్మికులు మద్దతిచ్చి బందులో పాల్గొన్నారు. బీసీ రిజర్వేషన్ జేఏసీ కార్యకర్తలు, అంబేద్కర్ చౌరస్తా వద్ద రస్తారోకో, మానవహారం నిర్వహించారు. ఈ ర్యాలీలో సీపీఐఎం జిల్లా కార్యదర్శి యాదయ్య పాల్గొన్నారు. బిఆర్ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ఆర్టీసీ డిపో వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను వైఖరిని ఎండగట్టారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ కొనసాగింది. బీసీ సంఘాల నేతలు, జేఏసీ నేతలు బందులో పాల్గొన్నారు. బీసీ బందుకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించడంతో, ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలోని బస్సులు కదలలేదు. స్వచ్ఛందంగా ఆర్టిసి కార్మికులు మద్దతు పలికారు. దీంతో బస్సులు డిపోలకే పరిమితం కావడం జరిగింది. రాష్ట్ర వ్యాప్త బంద్ కు ఆర్టీసీ కండక్టర్లు, డ్రైవర్లు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ డిపో వద్ద పోలీసులు భారీగా మోహరించి బందోబస్తు నిర్వహించారు. ఎప్పటికప్పుడు బందులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహేశ్వరం డీసీపీ సునీతా రెడ్డి పర్యవేక్షించారు. ఇబ్రహీంపట్నంలో దుకాణ సముదాయాల యజమానులు, బిసి రిజర్వేషన్ల బందుకు స్వచ్ఛందంగా మద్దతు పలకడంతో పట్నం రోడ్లు ఖాళీగా కనిపించాయి.

**కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉంది...**

కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే వరకు పోరాటం ఆగేది లేదని బీసీ రిజర్వేషన్ అందుకు పూర్తి మద్దతు ఉంటుందని ఎమ్మెల్యే రంగారెడ్డి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బిసి జనాభా ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, అసెంబ్లీలో అన్ని పార్టీల మద్దతు కూడగట్టడం జరిగిందని ఎమ్మెల్యే రంగారెడ్డి అన్నారు. అసెంబ్లీలో బిల్ పాస్ చేసి రాష్ట్రపతికి పంపిస్తే, కేంద్రంలో బీసీ రిజర్వేషన్లను పట్టించుకోకుండా, బీసీలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న బిజెపి సర్కార్, బీసీలకు అన్యాయం చేస్తుందని వారు అన్నారు. స్థానిక సంస్థలలో కచ్చితంగా 42% బీసీలకు సీట్లు కేటాయించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## ఔషధాలపై అవగాహన

**ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వరాదు**

**రాజేంద్రనగర్, మహా :** రోగ నిరోధానికి ఉపయోగించే ఔషధలపై ప్రజలు అవగాహనతో పాటు అప్రమత్తంగా ఉండాలంటూ శంషాబాద్ లోని పలు ఔషధాల వ్యాపారులకు దశా నిర్దేశం చేశారు. శంషాబాద్ లో శుక్రవారం రంగరెడ్డి జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ పర్యటించి తన వివరాలను ఔషధ వ్యాపారస్తులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు ,వైద్యుల సలహా మేరకు తమకు అవసరమైన ఔషధాలను మాత్రమే వాడకుండా ఇష్టం వచ్చినట్లు ఔషధాలను వాడి ప్రాణాలను కోల్పోతున్నారు. మోతాదుకు మించి ఔషధాలు వాడినట్లయితే కొన్ని సందర్భాల్లో ప్రాణాలు పోయే అవకాశం ఉందన్నారు. సర్జరీలలో ఉపయోగించే మత్తు మందులకు దూరంగా ఉండాలన్నారు. వాటిని ఎవరైనా అనవసరంగా వాడినట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. మందుల షాపుల యాజమాన్యాలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వరాదు. ఒకే ప్రిస్క్రిప్షన్ పై పలుమార్లు మందులు ఇవ్వడం అనేది చట్ట విరుద్ధం .మత్తు మందుల తయారీ , మందుల అక్రమ రవాణా, గర్భస్రావ కిట్లు అమ్మకం, సరైన ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తు కలిగించే ఔషధాల అక్రమ అమ్మకం, ఔషధాలకు సంబంధించి ఏమైనా ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలు ప్రజలు దృష్టికి వచ్చినట్లయితే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 6969 కు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు అన్ని పని దినాలలో సమాచారం ఇవ్వాలన్నారు. అదేవిధంగా సంబంధిత డ్రగ్ ఇన్స్పెక్టర్ లేదా అసిస్టెంట్ డైరెక్టర్ కు నేరుగా తెలియజేయాలి.



## వైద్యం వికటించి గర్భిణీ మృతి

**రంగారెడ్డి జిల్లా మహా :** మంచాల పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటు చేసుకుంది. మంచాల ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం వికటించి ఏడు నెలల గర్భిణీ మృతి చెందడం జరిగింది. మంచాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు మృతురాలి బంధువులు ఆందోళన చేపట్టారు. మంచాల మండలం లింగంపల్లి గ్రామానికి చెందిన మానస, వైద్యం కోసం మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడంతో, ఎలాంటి ప్రాథమిక చికిత్స చేయకుండా, బీపీ చెక్ చేయకుండా ఇంజెక్షన్ ఇచ్చారని, కొద్ది సేపటి తర్వాత కళ్ళు తిరిగి పడిపోవడం జరిగిందని, దీంతో గ్లూకోస్ పెట్టడంతో పరిస్థితి విషమించగా వెంటనే మరో ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందిందని కుటుంబీకులు తెలిపారు. మంచాల ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మానస మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మంచాల ప్రభుత్వ ఆసుపత్రి ముందు బయట ఉంచిన మృతురాలి బంధువులు గ్రామస్తులు, హాస్పిటల్ వద్దకు జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు రావాలంటు ఆందోళన చేపట్టారు. మానస మృతికి మంచాల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులే కారణం అంటూ, కుటుంబీకులకు న్యాయం జరగాలంటూ ఆందోళన దిగారు. వైద్యులను విధుల నుంచి తొలగించి, కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు.



## మంచిరేవులలలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

**గండిపేట, మహా :** కుళ్ళిపోయిన స్థితిలో గుర్తు తెలియని మృతదేహం లభించిన సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిరేవులలో జరిగింది. నార్సింగి సిఐ హరికృష్ణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో ని మంచిరేవుల చెరువులో మధ్యాహ్నం సమయంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కుళ్ళిన స్థితిలో నీటిపై ఉన్నాడని స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న నార్సింగి పోలీసులు స్థలానికి చేరుకొని విచారణ జరపగా మృతుడు సుమారు 35 సంవత్సరాలుగా అంచనాకు రాగ గుర్తుపట్టలేని విధంగా పూర్తిగా కుళ్ళిన స్థితిలో వుందన్నారు. ఆచూకీ కోసం విచారణ జరుపగా సమాచారం అందలేదని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించామన్నారు.

# బీసీ బంద్‌కు మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ

**అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో భారీ బైక్ ర్యాలీ**

**పెద్ద ఎత్తున హాజరైన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు.. బీసీ బిల్లు పట్ల బీజేపీ కి చిత్త శుద్ధి లేదని విమర్శలు**






**ఆదిలాబాద్ మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికిష్టం లేదని అందుకే ఇక్కడ గవర్నర్ సంతకం పెట్టకుండా అక్కడ పార్లమెంట్ లో బిల్లు ప్రవేశపెట్టకండా అడ్డుకుంటుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు. శనివారం బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు సంఘీభావంగా ఆదిలాబాద్ పట్టణంలో పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ లో ఆయన పాల్గొన్నారు. కైలాష్ నగర్ లోని ప్రజా సేవాభవన్ నుండి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల గుండా కొన సాగింది. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ..తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ లో పాస్ చేయించిన 42 శాతం బిల్లుకు గవర్నర్ సంతకం పెట్టుంటే ఇంత జరిగేది కాదన్నారు.బీసీల పట్ల బీజేపీ కి ఏమాత్రం చిత్త శుద్ధి ఉన్నా బిల్లు పాసయ్యేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ కు బీసీలపై ప్రేమ ఉంటే బిల్లుపై కేంద్రంతో కొట్లాడాలన్నారు.బీజేపీ కారణంగా బీసీల ఆశలన్నీ అడియాశలయ్యాయని, ఇటు హైకోర్టులో అటు సుప్రీంకోర్టులో కూడా ఈ బిల్లు అమలు కాకుండా కుట్ర పన్నుతుందన్నారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేవరకు కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గిమ్మసంతోష్,అల్లూరి అశోక్ రెడ్డి,కొండా గంగాధర్, గుడిపెల్లి నగేష్, చరణ్ గౌడ్, పత్తి ముజ్జు, సామ రూపేష్ రెడ్డి, దొగ్గలి రాజేశ్వర్,సంద నర్సింగ్, రాజు, బండారి సతీష్, రామ్ కుమార్, బొమ్మకంటి రమేష్, అల్చెట్టి నాగన్న, దాసరి ఆశన్న,దర్శనాల లక్ష్మణ్, రుకేష్ రెడ్డి, శ్రీలేఖ, కావేటి జ్యోతి, కొండూరి రవి, దీపక్ రావు, రఫిక్, బోనగిరి సంటెన్న, అల్లూరి భూమా రెడ్డి, సాహెబ్ రావు, కందుల సుకెందర్ పాల్గొన్నారు.

# బంద్ విజయవంతం

**సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు -కంది శ్రీనివాస రెడ్డి**



**ఆదిలాబాద్ మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు కోరుతూ బీసీ జేఏసీ పిలుపునిచ్చిన బంద్ కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించినట్టు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. బంద్ పూర్తిగా విజయవంతమైందని ఇందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆయన అన్నారు.

## కంది శ్రీనివాస రెడ్డిని కలిసిన లారీ ఓనర్స్ అసోసియేషన్ నాయకులు



**ఆదిలాబాద్ మహా :** లారీ ఓనర్స్ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జ్ కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం తనను కలిసేందుకు ప్రజా సేవాభవ్ కు వచ్చిన ఆదిలాబాద్ జిల్లా లారీ అసోసియేషన్ నాయకులకు ఆయన సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లారీ ఓనర్లు ఎదుర్కొంటున్నపలు ఇబ్బందులను నాయకులు కంది శ్రీనివాస రెడ్డి దృష్టికి తెచ్చారు. వాటిని సావధానంగా విన్న ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయనను కలిసిన వారిలో అధ్యక్షులు ఫహీం ఖాద్రి ,ప్రధాన కార్యదర్శి సందీప్.కోశాధికారి నయీముద్దీన్,వర్కింగ్ ప్రెసిడెంట్ అక్బర్ షరీఫ్,ఉపాధ్యక్షులు సయ్యద్ సిరాజ్,జాయింట్ సెక్రటరీ మోహిసిన్ అహ్మద్,సభ్యులు అమర్,అబ్దుల్ అజీజ్,వాహెద్, లతీఫ్ తదితరులున్నారు.

## కార్పొరేటర్ గుండేటి నరేందర్‌కు అస్వస్థత

**సిపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించిన ఎమ్మెల్సీ**

**వరంగల్ మహా;** బీసీ రిజర్వేషన్ల కోసం రాష్ట్ర బంద్ లో భాగంగా వరంగల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వరంగల్ పోచమ్మ మైదాన్ సెంటర్ లో నిర్వహించిన ర్యాలీలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ ఆకస్మికంగా అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలో ఆయన అక్కడికక్కడే పడిపోవడంతో కాంగ్రెస్ నాయకుడు ఎల్ శ్రీనివాస్, బస్వరాజు సారయ్య సహకారంతో వెంటనే సిపీఆర్ చేసి, ఆయనను హుటాహుటిన కారులో సమీపంలోని సంరక్ష హాస్పిటల్‌కు తరలించారు. నరేందర్ ను



వైద్యులు పరీక్షించి ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

## బిసీ బంద్ సక్సెస్

**బంద్ లోపాల్గొన్న ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలో బీసీ రిజర్వేషన్ సాధన కోసం శనివారం తెలంగాణ బంద్ కార్యక్రమంలో నిర్వహించారు... ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి బస్టాండ్ మీదుగా వైకుంఠ ద్వారం వద్ద



పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మోడీ నిరంకుశ వైఖరిని వీడి బీసీలకు న్యాయం చేసేందుకు బీసీల 42% శాతం రిజర్వేషన్ సాధన కోసం మద్దతు తెలియజేయాలని కోరారు,

# 42 శాతం రిజర్వేషన్లు మా బీసీల హక్కు

**ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**


**భువనగిరి, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం లోని ప్రిన్స్ కార్నర్ చౌరస్తా లో బీసీ రిజర్వేషన్ సాధన కోసం తెలంగాణ బంద్ ధర్నా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రిజర్వేషన్లు ఎవరు ఇచ్చే బిక్ష కాదని,అవి మా హక్కు అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో 42% శాతం రిజర్వేషన్ రక్షించుకోవటమే ధ్వేయంగా. బీసీ జే ఏసీ పిలుపు మేరకు తెలంగాణ బంద్ లో పాల్గొన్నామన్నారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి,గ్రంథాలయ జిల్లా చైర్మన్ అవేజ్ చిస్థీ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తంగళ్లపల్లి రవి కుమార్,సీనియర్ అడ్వకేట్ గొట్టిపాముల బాబు రావు,బీసీ సంఘం నాయకయలు నర్సింహ్మా, మెరుగు మధు,మాటూరు అశోక్ ,మాజీ మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, పొత్నాక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్,పెంట నర్సింహ్మా, లక్ష్మీ నారాయణ గౌడ్, దళిత నాయకులు బట్టు రాంచెంద్రయ్య కాంగ్రెస్ పార్టీ మండల,పట్టణ నాయకులు పాల్గొన్నారు.





## రాష్ట్ర బంద్ బంద్ విజయవంతం

**మందమర్రి, మహా :** తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శనివారం చేపట్టిన బంద్ మందమర్రిలో విజయవంతం అయింది. ఈ రాష్ట్ర బందులో రాష్ట్ర కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి గడ్డం వివేకానంద సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి, మందమర్రి పట్టణ బీసీ సంఘం అధ్యక్షులు సకినాల శంకర్ లు మాట్లాడుతూ బీసీలకు న్యాయంగా రావలసిన 42 శాతం రిజర్వేషన్ అమలు అయ్యేదాకా పోరాటాలను విడిచే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కుదిరి అంజయ్య, ప్రధాన కార్యదర్శి బత్తుల సతీష్, గౌరవ అధ్యక్షులు పోలు శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు మూడారపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## బెల్లంపల్లి నియోజకవర్గంలో బీసీ రిజర్వేషన్ల సమ్మెవిజయవంతం

**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బీసీ రిజర్వేషన్లకు తలపెట్టిన సమ్మె పూర్తిస్థాయిలో శనివారం నాడు విజయవంతం అయింది. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న బెల్లంపల్లి పట్టణంలోని పలు వ్యాపార సముదాయాలను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసి బందుకు సహకరించడం తోపాటు విద్యాసంస్థల సైతం సెలవు లు ఇవ్వడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు . సమ్మెతో పట్టణంలో పలు వ్యాపార సముదాయాలు ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఇచ్చిన పిలుపుమేరకు నిర్వహించ తలపెట్టిన సమ్మెలో మాదిగ హక్కుల దండోరా నాయకులు సైతం పాల్గొని విజయవంతం చేశారు.ఈ సందర్భంగామాట్లాడుతూ సమాజంలో అధిక శాతం కలిగిన బీసీలు రాజ్యాధికారం దిశగా వెళ్లే క్రమంలో వాళ్లకు సైతం అవకాశం కల్పించేలా 42 శాతాన్ని పాలక ప్రభుత్వం కల్పించి న్యాయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు వక్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఘర్షణ వాతావరణంలో బంద్

**వలిగొండ, మహా :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త బంధు కార్యక్రమంలో భాగంగా వలిగొండ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బందు కార్యక్రమం ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ సిపిఐ సిపిఎం బీఎస్పీ ఒకవైపు ఉండగా మరొకవైపు బిజెపి విడివిడిగా కార్యక్రమాలు చేస్తూ రాస్తారోకో కార్యక్రమం చేపట్టారు. దీనితో రహదారి పైన చాలా దూరం వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. దీనితో వాహనదారులు ఇబ్బంది పడ్డారు ఇరు వర్గాల మధ్య డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయడంతో రాస్తారోకో రసాభాసగా మారింది. ఇది గమనించిన స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ జోక్యం చేసుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింప చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం అధ్యక్షులు సాయిని యాదగిరి కాంగ్రెస్ నాయకులు నూతి రమేష్ కంకల కిష్టయ్య చెరుకు శివయ్య పాశం సత్తిరెడ్డి బోళ్లశ్రీనివాస్. కాసుల వెంకన్న కొండూరు భాస్కర్ సిపిఎం నాయకులు సిర్పంగి స్వామి మద్దెల రాజయ్య తుర్కపల్లి సురేందర్ సిపిఐ నాయకులు ఎలగందుల అంజయ్య పోలె పాక యాదయ్య సాయికుమార్ బి ఎస్ పి నాయకులు సుక్క శ్రీకాంత్ గుండు కృష్ణ ఎమ్మార్పీఎస్ నాయకులు పల్లెర్ల రామచందర్. బిజెపి నాయకులు బోళ్ల సుదర్శన్. బందారపు లింగస్వామి రాచకొండ కృష్ణ బచ్చ శ్రీనివాస్.పాల్గొన్నారు

# పార్టీలకు అతీతంగా బీసీ రిజర్వేషన్ బంద్‌కు మద్దతు

**రాజేంద్రనగర్ మహా :** తెలంగాణ రాష్ట్ర బీసీ సంఘాల పిలుపుమేరకు తెలంగాణా బంద్ కార్యక్రమాన్ని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ చౌరస్తా మున్సిపాలిటీ పరిధిలో శనివారం వివిధ పార్టీ నాయకులు, ప్రజా సంఘ నాయకులు శంషాబాద్ బస్టాండ్ లో బస్సులు రాకుండా బస్సులను అడ్డుకున్నారు. బస్సులను బస్టాండ్లో నిలిపివేశారు. వివిధ వ్యాపార సంస్థలను మూసివేశారు. బీసీ రిజర్వేషన్ ఆమోదించి స్థానిక సంస్థ ఎన్నికలలో 42 శాతం బీసీలకు చోటు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు రాచమల్ల యాదగిరి, మండల కార్యదర్శి నర్రగిరి, ఏఐటూసి రాష్ట్ర నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ గడ్డం శేఖర్ యాదవ్, మండల్ బిఆర్ఎస్ పార్టీ



అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు, మంచర్ల శ్రీనివాస్, కొన్నె మొల్ల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం మున్సిపల్ అధ్యక్షులు బొబ్బిలి మనోజ్, మున్నూరు కాపు టౌన్ అధ్యక్షులు ప్రసాద్, రజక సంఘం నాయకులు మెట్టు అశోక్, విట్టల్ గౌడ్, ఎమ్మార్పీఎస్ నాయకులు మద్దిలేటి మాదిగ, రమేష్ మాదిగ, భాస్కర్ మాదిగ, నాయి బ్రాహ్మణ సంఘం నాయకులు సిద్ధులు,వివిధ పార్టీల నాయకులు ప్రజాసంఘాల ప్రతినిధులు, కుల సంఘాల పెద్దలు నాయకులు పాల్గొన్నారు.

## బీసీలకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తాం

**బిజెపి మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**

**మొయినాబాద్ మహా:** బీసీలకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని మొయినాబాద్ మండల బిజెపి అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ కేంద్రంలోని శనివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వివిధ పార్టీలు పాల్గొని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దా రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. బీసీల కోసం జరుగుతున్నది కేవలం నిరసన కాదని ఆత్మగౌరవ పోరాటమని ఆయన స్పష్టం చేశారు. బీసీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న బంద్ కు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. బీసీల రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ బిజెపి నాయకులతో



కలిసి నిరసన చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదని ఆయన సూచించారు. రాజ్యాంగ బద్ధమైన పదవిలో ఉన్న గవర్నర్ రాజ్యాంగ పరిధిలో పనిచేస్తారని ఆయన తెలిపారు. బిజెపి పై ఆరోపణలు చేసే వారికి ముందు రాజ్యాంగంపై అవగాహన ఉండాలని ఆయన ఆరోపించారు.బీసీలను మోసం చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న నాటకమని ఆయన ఆరోపించారు.

## బాధలో ఓదార్పు.. కంది శ్రీనివాస రెడ్డి పరామర్శలు




**ఆదిలాబాద్ మహా :** బాధలో దుఖంలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెబుతూ అండగా నిలబడతారు ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి.ఆప్తులను కుటుంబ సభ్యులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న కుటుంబాలకు , అనారోగ్యంతో బాధపడుతున్న వారి చెంతకు వెళ్లి పరామర్శించి నేనున్నానంటూ కొండంత భరోసా కల్పిస్తారు. ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్ కాలనీకి చెందిన రామా గౌడ్ మాతృ మూర్తి నర్సమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరార్శించారు.అనంతరం పట్టణంలోని జీవన్ జ్యోతి హాస్పిటల్ లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న చిలుకూరి విలాస్ రెడ్డి మాతృ మూర్తి ని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## బెల్లంపల్లి నియోజకవర్గంలో రాజకీయ వేధింపులకు తావులేదు

**బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్**

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి నియోజకవర్గంలో రాజకీయవేధింపులకుతావు లేదని నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండేలా తానెప్పుడు ప్రజా సేవకే సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే గడ్డే వినోద్ ప్రకటించారు. శనివారం నాడు వేమనపల్లి మండలం నీల్వాయి గ్రామానికి చెందిన ఏటమధుకర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల వేధింపులు కారణంగా ఇటీవల ఆత్మ హత్య చేసుకోగా దినఖర్మకు హాజరై నివాళులర్పించి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ..బెల్లంపల్లి నియోజకవర్గంలో రాక్షస పాలన కొనసాగుతుంది...బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వేమన పల్లి బిజెపి అధ్యక్షుడు ప్రత్యేక గురైన మధుకర్ సందర్భాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ నియోజకవర్గంలో రాక్షస పాలన కొన



సాగుతుందని దీనినిఅరికట్టేలాప్రభుత్వయంత్రాంగం సిద్ధంగా లేదని విమర్శించారు.రాజకీయ వేధింపులకు ఎవరూ మనోవేదనకు గురికావద్దని, నియోజకవర్గంలో ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తమకు తెలియచేయాలని, ఎవరూ అధైర్యపడవద్దని, ప్రజాసేవకై తామెప్పుడూ సంసిద్ధంగా ఉంటామని తెలిపారు.

## హెచ్.ఐ.వి. నియంత్రణలో అందరూ భాగస్వామ్యం కావాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** హెచ.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో అందరూ భాగస్వాములు కావాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా హెచ్ ఐ వి నియంత్రణ యూనిట్ ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అనిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్ లతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని తెలిపారు. ప్రజలకు వ్యాధి పట్ల ఉన్న అపోహలు, అనుమానాలను తొలగించి, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షను రూపుమాపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య ఉపకేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని పరీక్షలతో పాటు హెచ్.ఐ.వి, ఎస్. టి.ఐ. వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేయడం జరుగుతుందని తెలిపారు. యువత హెచ్.ఐ.వి, ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని, వ్యాధి నియంత్రణలో భాగస్వాములై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఎం ఓ వెంకటేశ్వర్లు, సి హెచ్ ఓ నామ్ దేవ్, వైద్యాధికారులు, ఐ సి టి సి కౌన్సిలర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరు మార్కెట్ యార్డ్ ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంతరావు

**ఆలేరు, మహా:** రైతులు పండించిన ధాన్యంను కొనుగోలు సెంటర్ లోనే అమ్ముకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శనివారం ఆలేరు మండల కేంద్రంలో మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు... మార్కెట్ కి ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చిందని, ఇప్పటి వరకు ఎంత కొనుగోలు చేశారని సంబంధిత అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఈరోజు ధాన్యం కొనుగోలు చేసిన రైతు కిష్టయ్య తో మాట్లాడుతూ ధాన్యం మార్కెట్ యార్డ్ కి తెచ్చి ఎన్ని రోజులు అయిందని, మార్కెట్ కి ధాన్యం తీసుకొచ్చినప్పుడు అధికారులు ఎవరు అయినా ఇబ్బందులు పెట్టారా అని అడిగారు. ధాన్యం తూర్పార పట్టడానికి మిషన్ ఉచితంగానే ఇచ్చారు కదా అని అన్నారు. కిష్టయ్య మాట్లాడుతూ 3 రోజులు అయిందని వచ్చి ధాన్యం కోసిన వెంటనే మార్కెట్ యార్డ్ కి తీసుకవచ్చి ఆరబోసి , తూర్పార పట్టిన ఈరోజు అధికారులు వచ్చి చూసారు మాయిర్చర్ వచ్చింది అని చెప్పి తూకం



వేశారు లారీ కూడా వచ్చింది ఆన్లోడ్ కూడా చేశారు ఎలాంటి ఇబ్బంది జరగలేదు అని చెప్పారు .రైతులు ఎవరు కూడా కష్టపడి పండించిన పంట ని ఆరు కి మూడు కి అమ్ముకుని నష్టపోకూడదు అని అన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని సౌకర్యాలు కలిపించింది . ధాన్యం కి మద్దతు ధర కూడా కల్పించింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో మాత్రమే ధాన్యంను అమ్ముకోవాలని . ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

## వరుస సెలవులు.. ఐదు రోజులు బ్యాంకులు బంద్!

**భారతదేశంలో ఎక్కువమంది జరుపుకునే పండుగలలో.. దీపావళి ఒకటి. ఈ ఫెస్టివల్ సమయంలో అక్టోబర్ 19 నుంచి అక్టోబర్ 23 వరకు.. బ్యాంకులకు వరుసగా సెలవులు ఉన్నాయి. ఈ కథనంలో ఈ సెలవులకు సంబంధించిన మరిన్ని వివరాలు చూసేద్దాం.**

- అక్టోబర్ 19, ఆదివారం: (దేశంలోని అన్ని బ్యాంకులకు సెలవు).
- అక్టోబర్ 20, సోమవారం: దీపావళి (ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో సహా.. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని బ్యాంకులకు సెలవు).
- అక్టోబర్ 21, మంగళవారం: గోవర్ధన్ పూజ / లక్ష్మీ పూజ (మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా, సిక్కిం, మణిపూర్, జమ్మూ, శ్రీనగర్ రాష్ట్రాల్లోని బ్యాంకులకు సెలవు).
- అక్టోబర్ 22, బుధవారం: బలిపాడ్యమి (గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక, యూపీ, రాజస్థాన్, సిక్కింలోని బ్యాంకులకు సెలవు).
- అక్టోబర్ 23, గురువారం: భాయ్‌దూజ్, చిత్రగుప్త జయంతి, లక్ష్మీ పూజ (అహ్మదాబాద్, గ్యాంగ్‌టక్, ఇంఫాల్, కాన్పూర్, కోల్‌కతా, లక్నో, సిమ్లాలలో బ్యాంకులుకు సెలవు).




**అందుబాటులో ఆన్‌లైన్ సేవలు**

బ్యాంకులకు వెళ్లి చేసుకోవాల్సిన ఏదైనా అత్యవసరమైన పనిని.. సెలవులను గమనించి ముందుగానే పూర్తి చేసుకోవాలి. బ్యాంకుల ఫిజికల్ బ్రాంచీలు మూసివేసినప్పటికీ నెట్ బ్యాంకింగ్, యూపీఐ, మొబైల్ యాప్స్, ఏటీఎం విత్‌డ్రా వంటి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు యథావిధిగా కొనసాగుతాయి. వినియోగదారులు చెల్లింపులు చేయడం, బ్యాలెన్స్ చెకింగ్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్‌లు చేసుకోవచ్చు.

## దీపావళికి.. ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ గిఫ్ట్

ప్రయాణికుల సౌలభ్యం, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని 'ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్' పాస్ ప్రవేశపెట్టడం జరిగింది. ఇప్పుడు ఈ పాస్‌ను ఇష్టమైనవారికి గిఫ్ట్‌గా ఇవ్వొచ్చని 'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' (NHAI) వెల్లడించింది. దీనికి సంబంధించిన ఒక ట్వీట్ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఈ దీపావళికి మీ ప్రియమైన వారికి ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ గిఫ్ట్‌గా ఇవ్వండి. ఇది దేశవ్యాప్తంగా జాతీయ రహదారులు మరియు జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలలో ఏడాది పొడవునా ఇబ్బంది లేకుండా ప్రయాణించడానికి వీలు కల్పిస్తుందని తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేసింది.

**గిఫ్ట్‌గా ఎలా ఇవ్వాలి?**

రాజ్‌మార్గయాత్ర యాప్ ద్వారా యాన్యువల్ పాస్‌ను గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు. ఈ యాప్‌లోని 'యాడ్ పాస్' ఆప్షన్ మీద క్లిక్ చేసి, వినియోగదారుడు ఎవరికైతే గిఫ్ట్‌గా ఇవ్వాలనుకుంటున్నారో.. వారి వెనికల్ నంబర్ & ఇతర వివరాలను ఫిల్ చేసిన తరువాత.. ఓటీపీ ద్వారా కన్ఫర్మ్ చేయవద్దు. ఇలా చేసిన తరువాత యాన్యువల్ పాస్ యాక్టివేట్ అవుతుంది. రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ ప్రకారం.. యాన్యువల్ పాస్‌కు జాతీయ రహదారి వినియోగదారుల నుంచి అద్భుతమైన స్పందన లభించింది. ఆగస్టు 15న అమలులోకి వచ్చిన మొదటి రోజు సాయంత్రం 7:00 గంటల వరకు.. సుమారు 1.4 లక్షల మంది వినియోగదారులు వార్షిక పాస్‌ను కొనుగోలు చేసి యాక్టివేట్ చేసుకున్నారు. కాగా దీనిని ప్రారంభించిన రెండు నెలల్లోనే దాదాపు 5.67 కోట్ల లావాదేవీలతో.. 25 లక్షల మంది వినియోగదారుల మైలురాయిని దాటింది. జాతీయ రహదారి వినియోగదారులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండే.. ఈ ఫాస్ట్‌ట్యాగ్ యాన్యువల్ పాస్ ఒక సంవత్సరం లేదా 200 టోల్ ప్లాజా క్రాసింగ్‌లకు (ఏది ముందు అయితే అది) అనుమతిస్తుంది. దీనికోసం రూ. 3000 వన్ టైమ్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా లేదా ఎన్‌హెచ్‌ఏఐ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫీజు చెల్లిస్తే.. రెండు గంటల్లోపు యాక్టివేట్ అవుతుంది. అయితే దీనికోసం ప్రత్యేకంగా ఫాస్ట్‌ట్యాగ్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు.




## ఇల్లు కొనాలంటే.. చుట్టుపక్కల ఇవి ఉండాల్సిందే..

గృహ కొనుగోలుదారుల అభిరుచులు మారుతున్నాయి. గతంలో ధర ప్రాధాన్యంగా గృహ కొనుగోలు నిర్ణయం తీసుకునే కస్టమర్లు.. ఆ తర్వాత వసతులను పరిగణలోకి తీసుకున్నారు. నేటి యువతరం ఇల్లు కొనేటప్పుడు చుట్టుపక్కల ఆరోగ్య సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది ప్రధానంగా చూస్తున్నారు. అత్యవసరంలో ఎంత సమయంలో ఆసుపత్రికి చేరుకోవచ్చు? ఎంత సమీపంలో వైద్య సదుపాయాలు ఉన్నాయనేది ఆరా తీస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్దల ఆరోగ్య అవసరాల రీత్యా వీటికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇల్లు విశాలంగా ఉండటమే కాదు కమ్యూనిటీలో సకల సౌకర్యాలు ఉండాలనేది నేటి గృహ కొనుగోలుదారుల మాట. పిల్లల కోసం క్రీడా సదుపాయాలు, పెద్దలకు క్లబ్ హౌస్, జిమ్, స్విమ్మింగ్ పూల్ వంటి సదుపాయాలు ఉండాలని భావిస్తున్నారు. ఎక్కువ ఖాళీ స్థలం వదిలి, పచ్చదనం అధికంగా ఉంటే ఇష్టపడుతున్నారు. చిన్న కుటుంబాల నేపథ్యంలో పిల్లల ఆలనాపాలనా చూసే డే కేర్ సౌకర్యాలు ఉండాలని గృహ కొనుగోలుదారులు చూస్తున్నారు. భార్యాభర్తలిద్దరూ కార్యాలయాలకు వెళితే పిల్లలను చూసుకోవడం కష్టం అవుతుంది. వర్క్ ఫ్రం హోమ్ ఉన్నా పిల్లలపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. కమ్యూనిటీలో డే కేర్ సదుపాయాలు ఉండాలని కోరుకుంటున్నారు.

### వీకెండ్ ఎంజాయ్..

వీకెండ్ వస్తే కుటుంబంతో కలిసి ఆహ్లాదంగా గడిపేందుకు షాపింగ్ మాల్స్, థియేటర్లు ఎంత దూరంలో ఉన్నాయనేవి కూడా కొనుగోలు ఎంపికలో భాగమైపోయాయి. పచ్చని ప్రకృతిని ఆస్వాదించాలని కోరుకునే నివాసితులు శివారు ప్రాంతాలలో ఫామ్‌హౌస్‌లు, విల్లాల కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ఇల్లు కొనేటప్పుడు ఆఫీసుకు ఎంత దూరంలో ఉందనేది కస్టమర్ల ప్రాధామ్యాలలో ఒకటి. నగరంలో ట్రాఫిక్‌లోనే అధిక సమయం వృథా అవుతుంది కాబట్టి దూరం, సమయం అనేది ప్రధానంగా మారాయి. ప్రజా రవాణా సౌకర్యాలు ఎలా ఉన్నాయనేది పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటున్నారు.



## దీపావళి వేళ ఏరో ఎడిషన్ లాంచ్: స్పెషల్ కిట్ కూడా





టయోటా హైరైడర్.. స్పెషల్ ఎడిషన్‌ను లాంచ్ చేసింది. ఈ కొత్త కారు పేరు 'హైరైడర్ ఏరో ఎడిషన్' (రూ.10.94 లక్షలు). ఇది స్టాండర్డ్ హైరైడర్ కంటే రూ. 31,999 ఎక్కువ ధరలో ప్రత్యేకమైన స్టైలింగ్ కిట్‌ను పొందుతుంది. కంపెనీ అందించే ఈ ప్రత్యేకమైన స్టైలింగ్ కిట్‌లో.. బంపర్‌కు మరింత దూకుడుగా ఉండే లుక్‌ని ఇచ్చే ఫ్రంట్ స్పాయిలర్, వెనుక భాగంలో స్పాయిలర్, హైరైడర్‌కు మొత్తం మీద స్పోర్టియర్ లుక్‌ని తెచ్చే సైడ్ స్కర్ట్‌లు వంటివి ఉన్నాయి. ఈ కిట్ కూడా పరిమిత సమయం మాత్రమే అందుబాటులో ఉంటుంది. హైరైడర్ ఏరో ఎడిషన్ తెలుపు, సిల్వర్, నలుపు, ఎరుపు అనే నాలుగు రంగులలో లభిస్తుంది. కాగా టయోటా హైరైడర్ మైల్డ్‌హైబ్రిడ్ పెట్రోల్, స్ట్రాంగ్ హైబ్రిడ్ పెట్రోల్, సీఎన్జీ పవర్‌ట్రెయిన్‌తో అందుబాటులో ఉంది. ఇందులోని 1.5 లీటర్ మైల్డ్ హైబ్రిడ్ పెట్రోల్ ఇంజన్, 103 హార్స్ పవర్, 136 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది 5స్పీడ్ మాన్యువల్ లేదా 6స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌తో లభిస్తుంది. స్ట్రాంగ్ హైబ్రిడ్ ఇంజన్ 116 హార్స్ పవర్ ప్రొడ్యూస్ చేస్తుంది. ఇది eCVTతో లభిస్తుంది. CNG ఇంజిన్ 87 హార్స్ పవర్, 121 న్యూటన్ మీటర్ టార్క్ ప్రొడ్యూస్ చేస్తుంది.



## హెచ్1బీ ఫీజు పెంపుపై పిటిషన్

**వాషింగ్టన్:** విదేశీ వృత్తి నిపుణులకు అమెరికాలో ఉద్యోగాలు కల్పించేందుకు ఉద్దేశించిన హెచ్1బీ వీసా దరఖాస్తు ఫీజును లక్ష డాలర్ల (దాదాపు రూ.88 లక్షలు)కు పెంచటాన్ని సవాల్ చేస్తూ యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ కొలంబియాలోని ఒక జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అమెరికా పార్లమెంటు (కాంగ్రెస్) చేసిన చట్టంలో ఏకపక్షంగా మార్పులు చేసే అధికారం దేశాధ్యక్షుడికి లేదని గురువారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వంతోపాటు హోమ్‌లాండ్ సెక్యూరిటీ, మంత్రులు క్రిష్టి ఎల్ నోయెమ్, మార్కో రుబియోలను ప్రతివాదులుగా చేర్చింది. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయం పూర్తిగా అన్యాయం, తప్పుదోవ పట్టించే విధానం అని ఆరోపించింది. ఫీజు పెంపు వల్ల నైపుణ్యగల విదేశీ నిపుణులు అమెరికాలోకి రాలేరని, అప్పుడు దేశంలో పరిశోధనలు, పోటీతత్వం దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేసింది. ట్రంప్ నిర్ణయం అమెరికా ప్రత్యర్థి దేశాలకు మేలు చేసేదిగా ఉందని యూఎస్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ నీల్ బ్రాడ్లీ విమర్శించారు. పార్లమెంటు అధికారాలను కాలరాసి, అధ్యక్షుడు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవటం చెల్లదని స్పష్టంచేశారు. 3,600 ఉన్న హెచ్1బీ వీసా ఫీజును అధ్యక్షుడు ట్రంప్ గత నెల 19న ఒకేసారి లక్ష డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయం భారతీయ వృత్తినిపుణులపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఏటా దాదాపు 85,000 హెచ్1బీ వీసాలు జారీచేస్తుండగా, అందులో దాదాపు 70 శాతం భారతీయులే దక్కించుకుంటున్నారు.




## రష్యా ఆయిల్ కొనుగోళ్లను భారత్ ఆపేయబోతోంది: ట్రంప్

రష్యా నుంచి చమురు కొనుగోలు నిలిపివేసేందుకు భారత్ అంగీకరించిందని, ఈ మేరకు తన స్నేహితుడు, ఆ దేశ ప్రధాని నరేంద్ర మోదీ హామీ ఇచ్చారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పడం తెలిసిందే. అయితే భారత్ ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఈ దరిమిలా ట్రంప్ మరోసారి అదే వ్యాఖ్య చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్ రష్యా చమురు కొనుగోళ్లపై కీలక వ్యాఖ్యల చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీతో వైట్‌హౌజ్‌లో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రష్యా నుంచి చమురు కొనుగోలును అతిత్వరలోనే భారత్ నిలిపివేయబోతోందని అన్నారాయన. తద్వారా మాస్కోపై ఉక్రెయిన్ యుద్ధం ఆపేయాలనే ఒత్తిడి పెరగబోతోందని ట్రంప్ తాజాగా చెప్పారు. ఇండియా రష్యా నుంచి 38 శాతం చమురు కొనుగోలు చేసేది. అయితే ఇక నుంచి ఆ పని చేయబోదు. ఆ దేశం ఇప్పటికే కొనుగోళ్లను తగ్గించేసింది. దాదాపుగా ఆపేసే దాకా వచ్చింది అని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉంటే.. భారత్ ప్రధాని నరేంద్ర మోదీ తనకు రష్యా చమురు కొనుగోలు నిలిపివేతపై స్పష్టమైన హామీ ఇచ్చారని, తమ మధ్య ఫోన్ సంభాషణ జరిగిందని ట్రంప్ ప్రకటించడం తెలిసిందే. దీంతో.. ఇక్కడి ప్రతిపక్షాలు కేంద్రంపై విరుచుకుపడ్డాయి. ట్రంప్‌కు మోదీ భయపడుతున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు కూడా. అయితే.. భారత్ తమ పౌరుల ప్రయోజనాలకు అనుగుణంగానే నడుచుకుంటుందని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. అంతేకాదు.. ట్రంప్‌మోదీల మధ్య అటువంటి సంభాషణ ఏదీ జరగలేదని విదేశాంగశాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ స్వయంగా వెల్లడించారు కూడా. ట్రంప్ మొదటి నుంచి ఆరోపిస్తోంది ఏంటంటే.. భారత్ రష్యా నుంచి భారీగా చమురు కొనుగోలు చేస్తోందని, ఆ చమురును బహిరంగ మార్కెట్‌లో తిరిగి విక్రయించి లాభాలు పొందుతోంది అని. ఇది రష్యాకు ఆర్థికంగా మద్దతు ఇస్తోందని. అలా ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యాకు పరోక్షంగా భారత్ సహకరిస్తోందని ట్రంప్ అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలోనే.. ట్రంప్ భారత్‌పై 25% ప్రతీకార సుంకం (అంతకు ముందు విధించిన దాంతో కలిపి మొత్తంగా 50 శాతం) విధించినట్లు ప్రకటించారు కూడా. అమెరికాతో వాణిజ్య చర్చలు నడుస్తున్న వేళ ట్రంప్ మరోసారి భారత్ రష్యా చమురును ఆపేయబోతోందన్న వ్యాఖ్య చేయడం చర్చనీయాంశంగా మారింది ఇప్పుడు.




## తూచ్ అదంతా ఉత్తినే.. జెలెన్‌స్కీకి ట్రంప్ ఝలక్

**వాషింగ్టన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి మాట మార్చారు. రష్యాను బెదిరించినట్టే వార్నింగ్ ఇచ్చి.. వెంటనే యూటర్న్ తీసుకున్నారు. ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం ఆపకపోతే జెలెన్‌స్కీకి అమెరికా వద్ద ఉన్న అత్యంత శక్తివంతమై తోమహాక్ క్షిపణులను ఇస్తామని ప్రకటించిన ట్రంప్.. తాజాగా అలాంటిదేమీ లేదని చేతులెత్తేశారు. దీంతో, మరోసారి అందరి ముందూ నవ్వులపాలయ్యారు. ఇక, రష్యా చేత ఎలా అయినా యుద్ధం ఆపించాలని ట్రంప్ కంకణం కట్టుకున్నారు. ఇందు కోసం ఇప్పటికే పలు రకాల ప్లాన్స్ వేశారు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సైతం ట్రంప్ భేటీ అయ్యారు. కానీ, ఉక్రెయిన్‌పై రష్యా దాడులు మాత్రం ఆడగం లేదు. ఈ నేపథ్యంలో రష్యా బెదిరించేందుకు ట్రంప్ కొత్త ప్లాన్ చేశారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపకపోతే తమ దగ్గర ఉన్న అత్యంత శక్తివంతమై తోమహాక్ క్షిపణులను జెలెన్‌స్కీకి ఇవ్వాల్సి వస్తుందని రష్యాను బెదిరించారు. ఇలా అయినా పుతిన్‌కు దారికి తెచ్చేందుకు పైకి గంభీరంగా ప్రకటన చేశారు. అయితే, తాజాగా ట్రంప్‌తో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. ఓవల్ ఆఫీసులో అధ్యక్షుడు ట్రంప్‌ను జెలెన్‌స్కీ కలిశారు. ఈ సందర్భంగా తోమహాక్ క్షిపణులపై చర్చించారు. తమకు క్షిపణులను ఇవ్వాలని అందుకు బదులుగా తాము డ్రోన్లను ఇస్తామని జెలెన్‌స్కీ చెప్పుకొచ్చారు. కానీ, ట్రంప్ మాత్రం ఉక్రెయిన్ అధ్యక్షుడికి ఊహించని షాక్ ఇచ్చారు. తోమహాక్ క్షిపణులను ఇప్పుడు ఇవ్వలేనని ట్రంప్ తెగేసి చెప్పేశారు. తాజా పరిస్థితుల్లో అమెరికా నిల్వలను తగ్గించలేనని.. వాటిని సరి చూసుకోవాలని తెలిపారు. దాని కన్నా ముఖ్యంగా తనకు యుద్ధం ముగించడమే అత్యంత ముఖ్యమని తెలిపారు. ఈ సందర్భంగా రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అందుకే ఇప్పుడు తాను క్షిపణులను ఇవ్వలేనని చేతులెత్తేశారు. అయితే.. తోమహాక్ క్షిపణులు తమ దగ్గర ఉంటే రష్యా అధ్యక్షుడు పుతిన్ శాంతి చర్చలను సీరియస్‌గా తీసుకునేలా చేయవచ్చని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అంటున్నారు. మరోవైపు, బుడాపెస్ట్‌లో సమావేశం తర్వాత క్షిపణుల గురించి ఆలోచిస్తానని ట్రంప్ దానికి బదులు చెప్పారని వైట్‌హౌస్ అధికారులు చెబుతున్నారు. కాగా, ట్రంప్ తోమహాక్ క్షిపణుల నిరాకరణ వెనుక రష్యా అధ్యక్షుడు పుతిన్ హెచ్చరిక ఉందని తెలుస్తోంది. ఉక్రెయిన్‌కు క్షిపణులను ఇస్తే అమెరికారష్యా సంబంధాలకు హాని కలుగుతుందని, దాని వలన యుద్ధం మరింత సీరియస్ అవుతుందే తప్ప ఏం ఉపయోగం లేదని ఆయన హెచ్చరించినట్లు సమాచారం.



## పాకిస్తాన్ సైన్యం అరాచకం..

**కాబూల్:** దాయది దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య మరోసారి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రెండు దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం పొడిగింపు జరిగిన తర్వాత పాకిస్తాన్ కవ్వింపు చర్యలకు పాల్పడింది. డ్యూరాండ్ లైన్ వెంట వైమానిక దాడులకు తెగబడింది. ఈ దాడుల కారణంగా పదుల సంఖ్యలో ఆఫ్ఘన్ పౌరులు మృతి చెందినట్టు తెలిసింది. వారిలో ముగ్గురు ఆఫ్ఘన్ క్రికెటర్లు కూడా ఉన్నారు. పాక్ సైన్యం ఆఫ్ఘనిస్థాన్‌లోని మూడు రాష్ట్రాల్లో జనావాసాలే లక్ష్యంగా వైమానిక దాడులకు పాల్పడింది. ఇరుదేశాలు 48 గంటల కాల్పుల విరమణను పొడిగించడానికి పరస్పరం అంగీకరించిన కొన్ని గంటల తర్వాత పాక్ సైన్యం ఓవరాక్షన్‌కు దిగింది. డ్యూరాండ్ లైన్ (Durand Line) వెంబడి ఉన్న పక్తికా (Paktika) ప్రావిన్స్‌లోని అర్గున్, బెర్మల్ జిల్లాలలో పలు ఇళ్లపై మూడు ప్రాంతాల్లో బాంబు దాడి చేసింది. పాక్ దాడుల కారణంగా ముగ్గురు ఆఫ్ఘన్ క్రికెటర్లతో పాటుగా మరో 10 మంది పౌరులు మృతిచెందినట్టు సమాచారం. మరోవైపు.. పాక్ చర్యలపై తాలిబాన్ సీనియర్ నేత ఒకరు స్పందిస్తూ.. మూడు జిల్లాలపై పాక్ సైన్యం గగనతల దాడులకు తెగబడింది. పాక్ చర్యకు ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా.. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతను తగ్గించుకునేందుకు, రెండు దేశాల నాయకులు శనివారం ఖతార్, దోహాలో సమావేశం కానున్నారు. ఇప్పటికే పాక్ ప్రతినిధులు దోహా చేరుకున్నారు, ఆఫ్ఘనిస్థాన్ నుంచి ఇంకా బయల్దేరాల్సి ఉంది. అయితే, పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ముందే ఉల్లంఘించడం గమనార్హం.






## డీజీపీని కలిసిన మంచు మనోజ్ దంపతులు

టాలీవుడ్ హీరో మంచు మనోజ్ దంపతులు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డిని కలిశారు. మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. ఈ విషయాన్ని మనోజ్ తన సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేశారు. సమగ్రత, దార్శనికత కలిగిన నాయకుడు డీజీపీగా బాధ్యతలు స్వీకరించడం చూసి ఆనందంగా ఉందని ట్వీట్‌లో రాసుకొచ్చారు. మంచు మనోజ్ తన ట్వీట్‌లో ప్రస్తావిస్తూ..'నేను, నా భార్య మౌనిక గౌరవనీయులైన డీజీపీ శివధర్‌రెడ్డిని కలిశాం. సమగ్రత, దార్శనికత కలిగిన నాయకుడు బాధ్యతలు స్వీకరించడం చూసి ఆనందంగా ఉంది. అట్టడుగు స్థాయి నుంచి ఉన్నత స్థాయికి ఎదిగారు. ఆయన ప్రయాణం క్రమశిక్షణ, ధైర్యం, నైతిక పోలీసింగ్ పట్ల అచంచలమైన నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. భవిష్యత్తులో గొప్ప విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అంటూ పోస్ట్ చేశారు. ఈ ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది.

## ఫిబ్రవరిలో ప్రారంభం




'రంగస్థలం' (2018) వంటి బ్లాక్‌బస్టర్ చిత్రం తర్వాత హీరో రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించనున్నారు. ఈ సినిమా స్క్రిప్ట్ పనులు దుబాయ్‌లో జోరుగా జరుగుతున్నాయని తెలిసింది. గతంలో రామ్‌చరణ్, సుకుమార్ కలిసి ఈ సినిమా కథా చర్చల కోసం దుబాయ్‌లో సమావేశమైన సంగతి తెలిసిందే. ప్రస్తుతం దర్శకుడు సుకుమార్ దుబాయ్‌లో ఉంటూ, ఈ సినిమా స్క్రిప్ట్‌కు మరింత మెరుగులు దిద్దుతున్నారని సమాచారం. రామ్‌చరణ్ కెరీర్‌లోని ఈ 17వ సినిమా రెగ్యులర్ షూట్ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ప్రారంభం కానుందట. ఈ సినిమాలోని హీరోయిన్ పాత్రకు కృతీ సనన్, సమంత వంటి పేర్లు తెరపైకి వచ్చాయి. మరోవైపు ప్రస్తుతం 'పెద్ది' చిత్రంతో రామ్‌చరణ్ బిజీగా ఉన్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలోని ఈ సినిమా వచ్చే మార్చి 27న రిలీజ్ కానుంది.

## జోడీ రిపీట్?

నాగార్జున కెరీర్‌లోని వందో సినిమా 'కింగ్ 100' (వర్కింగ్ టైటిల్). తమిళ దర్శకుడు ఆర్‌ఏ కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాలో నాగార్జున ద్వి పాత్రాభినయం చేస్తున్నారని, కథలో ముగ్గురు హీరోయిన్లకు చాన్స్ ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా టబు ఖరారయ్యారనే వార్తలు తెరపైకి వచ్చాయి. తాజాగా మరో హీరోయిన్ పాత్ర కోసం మేకర్స్ అనుష్కా శెట్టిని సంప్రదించారని టాక్. ఇక 2005లో వచ్చిన 'సూపర్' సినిమాలో నాగార్జున, అనుష్కా శెట్టి హీరో హీరోయిన్లుగా నటించారు. ఆ తర్వాత 'డాన్' (2007), 'రగడ' (2010), 'ఢమరుకం' (2012) చిత్రాల్లో నాగార్జున, అనుష్క నటించారు. అలాగే నాగార్జున నటించిన 'సోగ్గాడే చిన్ని నాయనా' (2016)లో అతిథి పాత్ర చేశారు అనుష్క. ఇంకా నాగార్జున భక్తుడిగా నటించిన 'ఓం నమో వేంకటేశాయ' (2017)లో భక్తురాలిగా ఆమె నటించారు. ఇంకో విషయం ఏంటంటే... నాగార్జున హీరోగా నటించిన 'కింగ్' (2008)లో ఓ పాటలో నటించిన అనుష్క ఇప్పుడు 'కింగ్ 100'లో హీరోయిన్‌గా కనిపిస్తారా? నాగ్-అనుష్కల జోడీ రిపీట్ అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.









## కాంబినేషన్ సెట్?

హీరో విజయ్ దేవరకొండ-డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందనుందా? అంటే అవుననే వార్తలు వినిపిస్తున్నాయి. విజయ్ దేవరకొండ ప్రస్తుతం రెండు సినిమాలతో బిజీగా ఉన్నారు. తనకు 'టాక్సీవాలా' (2018) వంటి హిట్ మూవీ అందించిన దర్శకుడు రాహుల్ సంకృత్యాన్‌తో రెండో సినిమా చేస్తున్నారు విజయ్. మరోవైపు 'రాజావారు రాణిగారు' చిత్రదర్శకుడు రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాత డైరెక్టర్ విక్రమ్ కె. కుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమా చేయనున్నారని టాక్. 'ఇష్క్, మనం, హలో, నానీస్ గ్యాంగ్‌లీడర్' వంటి పలు చిత్రాలను తెరకెక్కించి, తెలుగు ప్రేక్షకుల్లో తనకంటూ ఓ గుర్తింపు సొంతం చేసుకున్నారు విక్రమ్ కె. కుమార్. ఇక ఆ మధ్యలో నితిన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కిస్తారనే వార్తలు వచ్చినప్పటికీ ఎలాంటి ప్రకటన లేదు. అయితే తన తాజా చిత్రాన్ని విజయ్‌తో చేయనున్నారట విక్రమ్. ఇందుకోసం కథ సిద్ధం చేసే పనిలో ఉన్నారట. మరి... ఈ కాంబినేషన్ సెట్ అవుతుందా? వేచి చూడాల్సిందే.



## షేన్ వాట్సన్ ఇళయరాజా పాట

ఒక ఇంటర్వ్యూలో 'డూ యూ హ్యావ్ ఎనీ స్పెషల్ టాలెంట్స్?' అనే ప్రశ్నకు సమాధానంగా గిటారు చేతిలోకి తీసుకున్నాడు ఆస్ట్రేలియన్ క్రికెటర్ షేన్ వాట్సన్. ఆంగ్ల పాట ట్యూన్ ఏదో ప్లే చేస్తాడు అని మనం అనుకునేలోపే ఇళయరాజా పాట 'ఎన్ ఇనియ పొన్నిలావే' కొంచెం ప్లే చేసి ఆశ్చర్యానికి గురి చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## నువ్వు నాదానివే..!



నచ్చిన డిజర్ట్ కళ్ల ముందు ఊరిస్తుంటే ఎవరికైనా నోరారా ఆరగించాలని అనిపిస్తుంది. రష్మికా మందన్నాకూ అలానే అనిపించింది. కానీ రష్మిక తినలేని పరిస్థితి. ఎందుకంటే... ప్రస్తుతం రష్మికా మందన్నా ఓ స్పెషల్ డైట్‌ను ఫాలో అవుతున్నారట. ఇందులో భాగంగా జిమ్‌లో స్పెషల్ వర్కౌట్స్ చేస్తున్నారు. అలాగే ఈ డైట్ మెనూలో రోజూ స్వీట్ తినకూడదు. దీంతో తన కళ్ల ముందు ఉన్న డిజర్ట్‌ను తినలేక పోతున్నానన్న బాధను ఎక్స్‌ప్రెస్ చేస్తూ, 'డియర్ డిజర్ట్... నువ్వు ఎప్పటికీ నా దానివే. కానీ ఈ రోజు కాదు' అనే క్యాప్షన్‌తో ఇన్‌స్టాలో రష్మిక ఓ వీడియోను షేర్ చేయగా, వైరల్ అవుతోంది. ''ఫిట్‌నెస్ కారణంగా సినిమా స్టార్స్ తమకు ఇష్టమైన ఆహారానికి దూరం కావాల్సిందే. ముఖ్యంగా హీరోయిన్స్ మెరుపు తీగలా ఉండటం కోసం నచ్చిన ఆహారాన్ని త్యాగం చేస్తారు... ఇలాంటి త్యాగాలు తప్పవు'' అని నెటిజన్లు స్పందిస్తున్నారు. ఇక రష్మికా మందన్నా నటించిన హిందీ చిత్రం 'థామా' ఈ నెల 24న విడుదల కానుంది. అలాగే రష్మిక లీడ్ రోల్ చేసిన 'ది గర్ల్ ఫ్రెండ్' నవంబరు 7న రిలీజ్ కానుంది. అలాగే 'మైసా' అనే ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్, హిందీలో 'కాక్‌టైల్ 2'తో పాటు మరో రెండు సినిమాలతో రష్మిక ఎప్పటిలానే బిజీ బిజీ.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com